

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక :319 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | సోమవారం 23 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :319 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : TIRUPATI | MON 23 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

- వికారాబాద్ జిల్లాలో ఆటోను ఢీకొట్టిన లారీ
- ఆటోలోని నలుగురు అక్కడికక్కడే మృతి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తింపు

- మిగతా 2లో

భారత వైవిధ్యానికి పుతిన్ ఫిదా..

ఇతర దేశాలకు ఆదర్శమంటూ ప్రశంసలు!



పెన్ పవర్ డెస్క్:భారత్‌లో భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ ప్రజలంతా ఐక్యంగా జీవిస్తున్న తీరు ప్రపంచ దేశాలకు ఆదర్శమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. భారతీయ నాగరికత, సంప్రదాయాలు ఎంతో ప్రత్యేకమైనవని కొనియాడారు. దేశంలోని భాషా వైవిధ్యం తనను

- మిగతా 2లో

ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి..

ప్రత్యేక టీషర్ట్‌ల ఆవిష్కరణ

- ప్రభాస్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానం
- 'హైదరాబాద్ వాక్స్' ప్రచార టీషర్ట్‌లను ఆవిష్కరించిన ప్రభాస్
- మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం గళమెత్తాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాల్సిందిగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నేడు ప్రభాస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్ లో ప్రభాస్ నివాసానికి వెళ్లిన ఆయన.. కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా నిర్వహిస్తున్న డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగంపై

- మిగతా 2లో



యలహంక ప్యాలెస్ కు వెళ్లకుండా షర్మిలను అడ్డుకున్న పోలీసులు...

- బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద వైఎస్ షర్మిల కాన్వాయ్ అడ్డగింత
- ఎలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశం లేదంటూ పోలీసుల స్పష్టీకరణ
- కోర్టు ఆదేశాల నేపథ్యంలో నగరంలోని హోటల్‌కు షర్మిల తరలింపు
- ప్యాలెస్ లీజు వివాదంపై కోర్టును ఆశ్రయించిన సిలికాన్ బిల్డర్స్
- కేసు తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసిన కోర్టు

పెన్ పవర్ డెస్క్:బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. కుటుంబ సమేతంగా నగరానికి చేరుకున్న ఆమెను జగన్ నివాసం ఉంటున్న యలహంక ప్యాలెస్ వైపు వెళ్లకుండా పోలీసులు నిలువరించారు. న్యాయస్థానం ఆదేశాలు ఉన్నందున ప్యాలెస్‌లోకి ప్రవేశించడానికి అనుమతి లేదని స్పష్టం చేస్తూ, ఆమె కాన్వాయ్‌ను దారిమళ్లించారు. ఈ క్రమంలో విమానాశ్రయం వెలుపల పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కుటుంబంలో జరగనున్న వివాహ ఏర్పాట్లకు సంబంధించి

- మిగతా 2లో



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో తాజాగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇటీవల పార్టీ గుర్తులపై జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఏకపక్ష ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ ప్రాతిపదికన జరిగిన పోరు ముగిసిందని, ఇక గ్రామాల్లో అభివృద్ధి ధ్యేయంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అదే విజయ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

పంచాయతీలు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి అక్కడ రాజకీయ ఘర్షణలకు తావులేకుండా ఏకగ్రీవాలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక నజరానాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గతంలో కనీస నజరానా రూ.5 లక్షలుగా ఉంటే దానిని ఇప్పుడు రూ.15 లక్షలకు, గరిష్ఠ నజరానాను రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షల ప్రోత్సాహకం అందుతుందని ఆయన గుర్తుచేశారు.

గ్రామ స్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్ర పట్టుదలతో ఉంటారని, అటువంటి చోట్ల నేతలతో సంప్రదింపులు జరపాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రత్యర్థి పార్టీ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో తమ పార్టీలోని నేతలే రెండు వర్గాలుగా విడిపోయి పోటీపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే మార్గమని ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



భారత్‌కు నేపాల్ ప్రధాని బలేంద్ర షా..

నేడు మోదీతో కీలక భేటీ!

పెన్ పవర్ డెస్క్: భారత్, నేపాల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. నేపాల్ ప్రధానమంత్రి బలేంద్ర షా రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం

- మిగతా 2లో



గుజరాత్‌లో ఘోర ప్రమాదం..

ఒకే కారులో ఏడుగురు దుర్మరణం!

పెన్ పవర్ డెస్క్:: గుజరాత్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన ట్రక్కు కారును ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు భారత సైనికులు, ముగ్గురు

- మిగతా 2లో

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..

ఎవరైనా పోటీ చేయవచ్చు

- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ప్రకటన
- పార్టీ శ్రేణులు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేయవచ్చని స్పష్టీకరణ
- పోటీ చేయాలనుకునే వారిని నాయకులు ఎవరూ అడ్డుకోవద్దని ఆదేశం
- పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని వెల్లడి
- స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్నికలు జరగాలని పిలుపు



- మిగతా 2లో



జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

- ఐఐటీలతో సమానంగా ఐటీఐలకు గుర్తింపు దక్కాలన్న లోకేశ్
- ప్రధాని మోదీ పోస్టుకు ఏపీ విద్యాశాఖ మంత్రి మద్దతు
- ఏఐ కాలంలో టెక్నికల్ నైపుణ్యాలకే అధిక విలువ
- జర్మనీ పరిశ్రమల అనుభవాన్ని ప్రస్తావించిన లోకేశ్
- వృత్తి విద్యపై సమాజంలో ఉన్న భావన మారాలన్న పిలుపు

- మిగతా 2లో

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా భారత్ ముందడుగు

- అంతరిక్షంలో సరికొత్త ఔషధాల అభివృద్ధిపై దృష్టి సారించిన భారత్
- మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో ప్రోటీన్ క్రిస్టల్స్ పెరుగుదలపై శాస్త్రవేత్తల పరిశోధనలు
- బెంగళూరు టెక్ సమ్మిట్‌లో స్పేస్ ఫార్మా అవకాశాలపై విస్తృత చర్చ
- అంతరిక్ష సాంకేతికతతో కొత్త ఔషధాల రూపకల్పన సాధ్యమన్న కిరణ్ మజుందార్ షా
- 2035 నాటికి సిద్ధం కానున్న భారతీయ అంతరిక్ష కేంద్రం

- మిగతా 2లో





ఏపీలో డిసెంబర్ పింఛన్లు ముందుగానే..

- నవంబర్ 30 మరియు డిసెంబర్ 1 తేదీల్లోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- డిసెంబర్ 2న పంచాయతీ పోలింగ్ ఉన్నందున ముందస్తు చెల్లింపులకు నిర్ణయం
- నవంబర్ నెల పింఛను తీసుకోని వారికి కలిపి రూ.8,000 చెల్లింపు
- ఎన్ఎస్ఏపీ లబ్ధిదారులకు కేంద్ర వాటా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ
- కొత్తగా దరఖాస్తు చేసుకున్న 13 లక్షల మంది వివరాల పరిశీలన త్వరలోనే పూర్తి

- మిగతా 2లో



జగన్ అంతకు మించి చేయలేరా ?

ఏపీలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార కూటమి అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్ జగన్ ఆరోపిస్తున్నారు. నామినేషన్ల అడ్డంకులు, రిగ్గింగ్‌పై ఎన్నికల సంఘం, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా.. సోషల్ మీడియా విమర్శలకే పరిమితమవుతున్నారనే చర్చ సాగుతోంది. ఢిల్లీ వెళ్లి జాతీయ మీడియా, ఇతర పార్టీల మద్దతుతో పోరాటం చేస్తే వైసీపీ వాదనకు మరింత ప్రచారం లభించేదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ గత కొన్ని రోజులుగా ఒకే రకమైన తీరున మాట్లాడుతున్నారు. అఫ్ కోర్స్ ఆయన మాట్లాడిన దాంట్లో వాస్తవాలు కూడా ఉన్నాయనుకోండి. కానీ అదే పనిగా ఆయన తన ఆవేదన కానీ ఆందోళన కానీ వ్యక్తం చేయడం వల్ల ఉపయోగం ఏమిటో వైసీపీ వారికే తెలియాలి. ఇంతకీ చెప్పొచ్చేది ఏంటి అంటే వైసీపీని నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికలు జరిగే దాకా కూడా అధికార కూటమి అడుగడుగునా ఇబ్బంది పెడుతోంది అని. ఫైర్ అండ్ ఫ్రీగా ఏపీలో స్థానిక ఎన్నికలు జరగడం లేదని. వైసీపీ వారు నామినేషన్లు దాఖలు చేస్తే వాటిని చింపేస్తున్నారు అని, అలాగే పోలింగ్ దగ్గర రిగ్గింగ్ చేస్తున్నారు అని, అధికార బలాన్ని అడుగడుగునా చూపిస్తున్నారు అని జగన్ ఆరోపణలు. ఆయన లేటెస్ట్ గా మరోసారి ఇదే విషయాలను ట్వీట్ రూపంలో చెప్పుకొచ్చారు.

వేదన అరణ్య రోదన :

జగన్ ఈ తరహా విమర్శలు కానీ ఆరోపణలు కానీ చేయడం వల్ల ఉపయోగం ఏమిటి అన్నది ఇక్కడ ప్రధానంగా చర్చ సాగుతోంది. అధికార పార్టీ దౌర్జన్యాలు చేస్తోంది అని జగన్ ఆరోపించారు. ఇప్పటికే ఆయన ఎన్నికల సంఘాన్ని కలసి ఫిర్యాదు చేశారు. గవర్నర్ ని కూడా కలసి వచ్చారు. ఆయన పార్టీ నాయకులు కూడా ఇదే విషయం మీద తాజాగా మరోసారి గవర్నర్ కి ఫిర్యాదు చేశారు. జగన్ అయితే ట్వీట్లు వేస్తూ ప్రజా స్వామ్యం ఖూనీ అవుతోంది అని అంటున్నారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగడం లేదు అని అంటున్నారు. కానీ ఇదంతా అరణ్య రోదన గానే మిగిలిపోతోంది అని అంటున్నారు. ఎందువల్ల అంటే వైసీపీ న్యాయ పోరాటాలు చేసినా మరోటి చేసినా ఏపీలో కూటమి వ్యూహాత్మకంగా చేయాల్సింది చేస్తోంది. అలాంటపుడు దీనికి ఇతర మార్గాలను కూడా ఆలోచించాలి కదా అన్న చర్చ సాగుతోంది.

జాతీయ దృష్టికి :

ఏపీలో ఏమి జరుగుతోంది అన్నది జాతీయ మీడియా దృష్టికి తేవడమో లేకపోతే జగన్ ఢిల్లీ వెళ్ళి అక్కడ భావ సారూప్యత కలిగిన పార్టీలతో కలిసి ఆందోళన నిర్వహించడమో చేయడం ద్వారా జాతీయ దృష్టిని ఆకట్టుకునే ప్రయత్నం చేసి ఉంటే ఎంతో కొంత వైసీపీకి మైలేజ్ దక్కేది అని అంటున్నారు. అంతే కాదు వైసీపీ చేస్తున్న వాదన ఢిల్లీ దాకా వినిపించేది అని కూటమిని అలా ఎక్స్ పోజ్ చేసేందుకు వీలు అయ్యేది అని అంటున్నారు. నిజానికి చూస్తే ఏపీలో జరుగుతున్న పరిణామాలు జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న బీజేపీకి తెలియనివి కావు అన్నది కూడా ఉంది. కానీ ఢిల్లీ వేదికగా చేసుకుని నిరసనలు కానీ ఏదైనా ఆందోళనలు కానీ చేసిన పక్షంలో ఎన్డీయేకి వ్యతిరేకంగా ఉండే పార్టీల నుంచి అయినా మద్దతు దొరికి ఆ మేరకు ఎన్డీయే మీద జాతీయ స్థాయిలో ఏపీలోనూ ఒత్తిడి పెరిగేది కదా అన్నది కూడా రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి.

రోటీన్ గానే అంతా :

కానీ జగన్ అయితే రొటీన్ గా ట్వీట్లు పెడుతూనే అధికార కూటమి మీద సోషల్ మీడియా వేదికగానే యుద్ధం చేస్తున్నారు అని అంటున్నారు. పులివెందులలో ఎన్నికలు సందర్భంగా జగన్ నిరసన చేశారు. అది బాగా హైలెట్ అయింది. మళ్ళీ ఆ స్థాయిలో వైసీపీ నుంచి పోరాట స్ఫూర్తి లేకుండా పోయింది అని అంటున్నారు. అంతే కాదు నేషనల్ మీడియాతో ఇంటరాక్ట్ అవుతూ ఎప్పటికప్పుడు ఏపీలో జరుగుతున్న రాజకీయం మీద పరిణామాల మీద జగన్ ఇంటర్వూలు ఇస్తూ ఉంటే కూడా ఏపీలో కూటమి మీద అది ఒత్తిడి పెంచేదిగా ఉండేదని అంటున్నారు. పొరుగున ఉన్న కేటీఆర్ అయితే వివిధ నేషనల్ ప్లాట్ ఫారాలను ఎంచుకుని అక్కడ డిబేట్లకు హాజరవుతున్నారు. ఇంటరాక్ట్ అవుతున్నారు. వైసీపీ అధినేత మాత్రం ట్వీట్లతో సరిపెడుతున్నారు అన్న చర్చ అయితే సాగుతోంది. జగన్ అంటే ఫైర్ బ్రాండ్ అని 2014 నుని 2019 దాకా ఆయన డైనమిక్ లీడర్ షిప్ ని చూసిన వారు అనే మాట. ఆనాడు ఆయన ఢిల్లీ దాకా వెళ్ళి మరీ ఆందోళనలు చేశారు. మరి ఇపుడు అయితే అలాంటిది ఏదీ లేదని కూడా చర్చ అయితే సాగుతోంది. మరి వైసీపీ ఆలోచనలు వ్యూహాలు ఏమిటో చూడాల్సి ఉంది.

భారత్‌కు నేపాల్ ప్రధాని బలేంద్ర షా.. నేడు మోదీతో కీలక భేటీ!

- మొదటి పేజీ తరువాయి

మేరకు ఆయన ఈ పర్యటనకు వచ్చారు.న్యూఢిల్లీలోని విమానాశ్రయంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బలేంద్ర షాకు స్వాగతం పలికారు. ఆయన వెంట నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే, విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా భారత్‌కు వచ్చారు.ఈ పర్యటనలో భాగంగా సోమవారం (నవంబర్ 23) ప్రధాని నరేంద్ర మోదీతో బలేంద్ర షా ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రవాణా, మౌలిక సదుపాయాలు, ఇంధనం, జలవనరుల సహకారంపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.లాగే ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతోనూ బలేంద్ర షా భేటీ కానున్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆదివారం ఆయనతో సమావేశమయ్యారు.మార్చి 2026లో నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బలేంద్ర షా తొలిసారిగా భారత్‌లో పర్యటిస్తున్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన చేపట్టిన తొలి ద్వైపాక్షిక విదేశీ పర్యటన కూడా ఇదే కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో భారత్, నేపాల్ మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఇరు దేశాలు ఆశిస్తున్నాయి.

పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..

ఎవరైనా పోటీ చేయవచ్చు

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలవవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చే జనసేన శ్రేణులను పార్టీలోని నాయకులు ఎవరూ అడ్డుకోకూడదని పవన్ కల్యాణ్ కరాఖండిగా ఆదేశాలు జారీ చేశారు. స్థానిక స్థాయిలో ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, ప్రజల మద్దతు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు.

మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి స్థానాల పంపకాలు (సీట్ల సర్దుబాటు) ఉండవని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగే ఎన్నికలని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునే ప్రతి పౌరుడికి నామినేషన్ దాఖలు చేసే పూర్తి హక్కు ఉంటుందన్నారు.

జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.

ఏపీలో డిసెంబర్ పింఛన్లు ముందుగానే..

ఆంధ్రప్రదేశ్‌లోని 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ల మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన ప్రారంభమయ్యే ఈ పంపిణీ ప్రక్రియను, ఈసారి నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీల్లోనే పూర్తి చేయాలని యంత్రాంగం నిర్ణయించింది.రాష్ట్రంలో డిసెంబర్ 2వ తేదీన పంచాయతీ ఎన్నికల మూడో విడత పోలింగ్ జరగనుంది. ఆ సమయంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది అంతా పూర్తిగా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉంటారు. దీనివల్ల పింఛన్ల పంపిణీలో ఎటువంటి జాప్యం లేదా ఆటంకాలు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ముందస్తు పంపిణీ నిర్ణయాన్ని తీసుకుంది. గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలోనూ నవంబర్ పింఛన్లను అక్టోబర్ 30వ తేదీనే అందజేసిన విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ పింఛన్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 2,774 కోట్ల నిధులను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి నగదు రూపంలో పింఛన్లను అందజేస్తారు. అలాగే, గత నెలలో వివిధ వ్యక్తిగత కారణాల వల్ల నవంబర్ పింఛన్ తీసుకోలేకపోయిన లబ్ధిదారులకు, ఈ నెల మొత్తంతో కలిపి ఒకేసారి రూ.8,000 అందజేయనున్నారు.కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద ఉన్న సుమారు 9.34 లక్షల మంది లబ్ధిదారులకు కేంద్ర వాటా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. వీరంతా తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ అయిందో లేదో ఒకసారి సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కేంద్ర వాటా బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లగా, మిగిలిన మొత్తాన్ని సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదుగా అందిస్తారు.మరోవైపు, కొత్త పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే, డిసెంబర్ నెలలోనే ఈ దరఖాస్తులపై ప్రత్యేక విచారణ జరపనున్నారు. నిర్దేశిత ఏడు దశల అర్హత ప్రమాణాల (సెవెన్ స్టెప్ వెరిఫికేషన్) ప్రకారం పూర్తిస్థాయిలో తనిఖీలు చేసిన తర్వాతే అర్హులను ఎంపిక చేస్తారు. ఈ నిబంధనలకు లోబడి ఎంపికైన అర్హులకు వచ్చే ఏడాది జనవరి నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

ఐఐటీ విద్యార్థులతో సమానంగా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) విద్యార్థులకూ సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టుకు లోకేశ్ స్పందిస్తూ, ఈ ముఖ్యమైన విషయాన్ని లేవనెత్తినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శకంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఫ్యాక్టరీ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగావకాశాలు, ప్రాధాన్యత భారీగా పెరుగుతాయని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను యువకుడిగా ఉన్నప్పుడు జర్మనీలోని ఆటోమొబైల్ ఫ్యాక్టరీలలో ఇంటర్న్‌షిప్ చేశాను. అక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంతగా గౌరవిస్తారో నేను స్వయంగా చూశాను. ఆ నైపుణ్యాలకు ఇచ్చే గౌరవమే జర్మనీ ప్రపంచంలోనే అత్యుత్తమ తయారీ రంగ కేంద్రంగా ఎదగడానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో కూడా ఐటీఐలపై ఉన్న చిన్నచూపును తొలగించి, నైపుణ్యంతో కూడిన పనులపై గౌరవమర్యాదలు తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని లోకేశ్ వివరించారు.రాబోయే రోజుల్లో తయారీ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. సాధారణ విద్యా కోర్సులతో సమానంగా వృత్తి విద్యా కోర్సులకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఐటీఐ విద్యార్థుల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం ఏర్పడినప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తమ వృత్తి పట్ల వారు మరింత గర్వపడే వాతావరణం ఏర్పడుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

అంతరిక్షంలో ఔషధాల తయారీ దిశగా భారత్ ముందడుగు

భారతదేశం తన విస్తరిస్తున్న అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను ఫార్మా రంగంతో అనుసంధానించి, సరికొత్త ఔషధాల ఆవిష్కరణకు మార్గం సుగమం చేస్తోంది. అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (భార రహిత స్థితి) వాతావరణాన్ని వినియోగించుకుని నెక్స్ట్ జనరేషన్ మందులను ఎలా అభివృద్ధి చేయవచ్చనే అంశంపై భారత శాస్త్రవేత్తలు, బయోటెక్నాలజీ కంపెనీలు, స్టార్టప్‌లు ముమ్మరంగా దృష్టి సారిస్తున్నాయి.

ఇటీవల నవంబర్ 19న ముగిసిన బెంగళూరు టెక్ సమ్మిట్‌లో అంతరిక్షంలో ఔషధాల తయారీ, ప్రయోగాల నిర్వహణపై కీలక చర్చ జరిగింది. భవిష్యత్తులో దేశం నిర్మించనున్న అంతరిక్ష మౌలిక సదుపాయాలు బయోటెక్నాలజీ పరిశోధనలకు ఎలా ఉపయోగపడతాయనే విషయాన్ని పరిశోధకులు, విధాన రూపకర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విస్తృతంగా పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా సరసమైన ధరలకే నాణ్యమైన మందులు, టీకాలను సరఫరా చేస్తూ 'ప్రపంచ ఫార్మసీ'గా గుర్తింపు పొందిన భారత్, ఇప్పుడు తన ఔషధ తయారీ శక్తిని అంతరిక్ష ప్రయోగాలతో కలపాలని భావిస్తోంది.భూమిపై గురుత్వాకర్షణ శక్తి కారణంగా ప్రోటీన్ క్రిస్టల్స్ ఏర్పడే తీరుపై ప్రభావం పడుతుంది. అదే అంతరిక్షంలోని దాదాపు భార రహిత వాతావరణంలో ఈ క్రిస్టల్స్ అత్యంత సమతుల్యంగా పెరుగుతాయి. దీనివల్ల ప్రోటీన్ల నిర్మాణాన్ని శాస్త్రవేత్తలు లోతుగా అధ్యయనం చేయడానికి వీలవుతుంది. ఈ పరిశీలనలు ఔషధ సూత్రీకరణలను మెరుగుపరచడమే కాకుండా, కొత్త చికిత్సా పద్ధతుల అభివృద్ధిని వేగవంతం చేస్తాయని నిపుణులు వివరిస్తున్నారు.ప్రముఖ బయోఫార్మాస్యూటికల్ సంస్థ బయోకాన్ కూడా అంతరిక్ష ఆధారిత పరిశోధనలపై ఎంతో ఆసక్తి చూపిస్తోంది. స్పేస్ టెక్నాలజీల ద్వారా అణు నిర్మాణాలను మార్చవచ్చని, తద్వారా కొత్త మేధో సంపత్తి (ఐపీ), సరికొత్త అణువులు, మెరుగైన సామర్థ్యం కలిగిన ఔషధాలను రూపొందించవచ్చని బయోకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షా పేర్కొన్నారు.

ప్రస్తుతం సేవలందిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కాలపరిమితి 2030 నాటికి ముగిసే అవకాశం ఉండటంతో, ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు వాణిజ్య అంతరిక్ష ప్రయోగశాలల ఏర్పాటుపై దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలో భారత్ 2035 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న 'భారతీయ అంతరిక్ష కేంద్రం' అంతర్జాతీయ బయోటెక్నాలజీ, ఫార్మా పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. అయితే శాశ్వత అంతరిక్ష కేంద్రం అందుబాటులోకి వచ్చేలోపే మైక్రోగ్రావిటీ ప్రయోగాలను ప్రారంభించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

భారత వైవిధ్యానికి పుతిన్ ఫిదా..

- మొదటి పేజీ తరువాయి

ఎంతగానో ఆశ్చర్యపరిచిందని పేర్కొన్నారు. సెర్బియాకు చెందిన ప్రముఖ చిత్ర దర్శకుడు, రచయిత ఎమిర్ కుస్తురికాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ భారత్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన సంభాషణను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.భారత్‌లో ఎంతమంది ప్రజలు హిందీ మాట్లాడుతున్నారని మోదీని అడిగినట్లు పుతిన్ వెల్లడించారు. దేశంలో సుమారు 60 కోట్ల మంది హిందీ మాట్లాడుతున్నారని ప్రధాని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. భారత్ మొత్తం జనాభా ఎంత అని అడగ్గా దాదాపు 150 కోట్లు అని చెప్పినట్లు వివరించారు.

అంటే దేశ జనాభాలో మూడింట ఒక వంతు మంది మాత్రమే హిందీ మాట్లాడుతుండగా, మిగిలిన వారు వివిధ ప్రాంతీయ భాషల్లో మాట్లాడుతున్నారని పుతిన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇన్ని భాషలు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ ప్రజలంతా కలిసి జీవించడం అద్భుతమని వ్యాఖ్యానించారు.

భారతీయ నాగరికత ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన నాగరికతల్లో ఒకటని పుతిన్ పేర్కొన్నారు. భారత్ గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే అంతగా ఆసక్తి పెరుగుతోందని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న భారతదేశం ఇతర దేశాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లాలోని బుగ్గ రామేశ్వరం వద్ద వేగంగా వచ్చిన ఓ లారీ, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నగేష్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని, పెండ్లిముడుగు గ్రామం నుంచి పనుల నిమిత్తం కేరెళ్లికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. మలుపు వద్ద లారీ అతివేగంగా, అజాగ్రత్తగా రావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యలహంక ప్యాలెస్ కు వెళ్లకుండా షర్మిలను అడ్డుకున్న పోలీసులు...

- మొదటి పేజీ తరువాయి

షర్మిల తన తల్లి వైఎస్ విజయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి బెంగళూరు చేరుకున్నారు. అయితే విమానాశ్రయం నుంచి వాహనాల్లో బయలుదేరిన వెంటనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. యలహంక వైపు వెళ్లే మార్గాన్ని కాదని, వాహనాలను బెంగళూరు నగరం వైపు మళ్లించారు. కోర్టు ఆదేశాలను పాటించాలని సూచిస్తూ ఆమెను నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌కు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విమానాశ్రయంతో పాటు యలహంక ప్యాలెస్ పరిసరాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ వివాదం వెనుక న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. షర్మిల పర్యటన నేపథ్యంలో, జగన్ వర్గం తరఫున సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి భీమిశెట్టి రమేశ్ బాబు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలను పరిశీలించిన న్యాయస్థానం.. వైఎస్ షర్మిల గానీ, ఆమె అనుచరులు గానీ యలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశించకూడదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో భాగంగానే పోలీసులు విమానాశ్రయం వద్ద షర్మిలను అడ్డుకుని వెనక్కి పంపారు.

ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి.. ప్రత్యేక టీషర్ట్‌ల ఆవిష్కరణ

- మొదటి పేజీ తరువాయి

అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభాస్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంయుక్తంగా 'హైదరాబాద్ వాక్స్ – నషా ముక్త్ భారత్' (Hyderabad Walks -- Nasha Mukt Bharat) కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక టీషర్ట్‌లను ఆవిష్కరించారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలనే ప్రధాన సందేశాన్ని ఈ ప్రచారం చాటిచెబుతోంది. ఈ సందర్భంగా "మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం మనమందరం గళమెత్తుదాం!" అంటూ పిలుపునిచ్చారు. యువతలో విపరీతమైన అభిమానం ఉన్న ప్రభాస్ వంటి అగ్ర నటుడు ఈ అవగాహన ఉద్యమానికి మద్దతు తెలపడం ద్వారా సమాజంలో మరింత సానుకూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

గుజరాత్‌లో ఘోర ప్రమాదం.. ఒకే కారులో

ఏడుగురు దుర్మరణం!

- మొదటి పేజీ తరువాయి

చిన్నారులు ఉండటం కలచివేసింది.గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భుజ్–ఖావ్డా జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ ప్రాంతానికి చెందిన రెండు కుటుంబాలు గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్‌ను సందర్శించి తిరిగి భుజ్‌కు వెళుతున్నాయి.ఈ క్రమంలో ఖావ్డా నుంచి భుజ్ వైపు వెళ్తున్న హ్యుందాయ్ ఆరా కారును ఎదురుగా వచ్చిన ట్రైలర్ ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి కారు తీవ్రంగా దెబ్బతిని నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భుజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సైనికులు, వారి భార్యలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మూడునెలల పసికందు కూడా ఈ ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా ధ్వంసం కావడంతో మృతదేహాలను బయటకు తీయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రమాదంపై ఫోరెన్సిక్ బృందం పరిశీలన జరిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కో మృతుడి కుటుంబానికి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సైతం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు.. ప్రచారంలో దూసుకెళ్లిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

- అభివృద్ధి చేసే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి: ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పిలుపు

- కావలి 3వ వార్డులో జోరుగా ఎన్నికల ప్రచారం.. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



కావలి: నవంబర్,22 పెన్ పవర్

కావలి పట్టణంలోని 3వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ ప్రచార కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రచారాన్ని ప్రారంభించడానికి ముందుగా ఆయన జెండా చెట్టు వద్ద ఉన్న దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతోకలిసివార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి భరత్ కుమార్ మరియు 3వ వార్డు టీడీపీ అభ్యర్థి షేక్ రఫీ అహమ్మద్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3వ వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు ఎలాంటి కష్టాలు లేకుండా చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో వార్డును మరింతగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేసే నాయకులకు ఓటు వేయాలని, కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు..

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు





- మెగా రక్తదాన, ఉచిత కంటి వైద్య శిబిరం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 22.

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక డిఎల్ఎన్ఆర్ గవర్నమెంట్ హై స్కూల్ ప్రాంగణంలో వాసన్ ఐ కేర్, మెడిపల్స్ బ్లడ్ సెంటర్ వారి సౌజన్యంతో మునిసిపల్ చైర్ పర్సన్ దొడ్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత కంటి, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ దొడ్ల విజయలక్ష్మి మాట్లాడుతూ సేవా భావం కలిగిన అభివృద్ధి ప్రదాత కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలను తాను చైర్ పర్సన్ అయిన వెంటనే జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి కోట్ల రూపాయలు వెచ్చించి నియోజకవర్గాన్ని అదేవిధంగా బుచ్చిరెడ్డిపాలెం పట్టణాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నాయకుల, కార్యకర్తల సహకారంతో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసి ఎమ్మెల్యే తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య, నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి, ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, భువనేశ్వర్ మురళి పట్టం రాఘవయ్య నాగ సాయి కౌన్సిలర్లు, మహిళా నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ మహిళా నాయకురాలు కే. దుర్గా వైఎస్సార్‌సీపీలో చేరిక

- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న దుర్గా

శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,నవంబర్ 22:



శ్రీకాళహస్తి పట్టణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ టౌన్ మహిళా వైస్ ప్రెసిడెంట్ కే. దుర్గా ఆదివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.టీడీపీలో మహిళా నాయకురాలిగా కొనసాగిన దుర్గా వైఎస్సార్‌సీపీలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె చేరికతో 8వ వార్డులో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

కార్తీకమాస ఆకాశదీపం 14వ రోజు భక్తిశ్రద్ధలతో దర్శనం



శ్రీకాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 22:

పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఆకాశదీపం కార్యక్రమం 14వ రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన దీపాన్ని దర్శించుకునేందుకు భక్తులుఆసక్తిగాతరలివచ్చారు.దీపకాంతులతోఆధ్యాత్మికవాతావరణంనెలకొనగా శివనామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. కార్తీకమాస ఆకాశదీప దర్శనం భక్తుల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.

25, 26, 27, 28, 30 వార్డుల్లో బొజ్జల సుధీర్ రెడ్డి విస్తృత ప్రచారం

- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులను గెలిపించండి ఎమ్మెల్యే బొజ్జల పిలుపు

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 22:



పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, చైర్మన్ అభ్యర్థి పేట బాలాజీతో కలిసి 25, 26, 27, 28, 30 వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు.

రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యంవంటిమౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళిక
కలను వివరించారు.

శ్రీకాళహస్తిని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నవంబర్ 26న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చైర్మన్ అభ్యర్థి పేట బాలాజీతో పాటు కూటమి వార్డు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

సూళ్ళూరుపేట లో జనసేనకు కొత్త ఉత్సాహం!

- పార్టీ బలోపేతమే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు..

ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకుల కృషి

సూళ్ళూరుపేట నవంబర్ 22 పెన్ పవర్ ప్రతినిధి.

నాయుడుపేట. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో నాయకులు చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

ఈ క్రమంలో సూళ్ళూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ అసెంబ్లీ సమన్వయకర్త బాలు శెట్టి నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు కృషి చేస్తున్నారు.

ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు కేశవరెడ్డి, బొల్లాకాయల కిరణ్, విజయ్ మల్లం, తాళ్లరెడ్డి శ్రీనివాస్, వీర మహిళలు మనుబోలు రోహిణి, సల్మా తదితరులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

పార్టీ నాయకులు, వీర మహిళలు కలిసికట్టుగా పనిచేస్తూ జనసేన పార్టీ ఆశయాలు, అధినేత పవన్ కళ్యాణ్ ప్రజా సేవా ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సంకల్పిస్తున్నారు.



ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, యువతను మరియు మహిళలను రాజకీయాల్లో భాగస్వాములను చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ మరింత బలపడేందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే సహించం .కాకాణి



- మాజీ మంత్రివర్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా కాకాణి గోవర్ధన్ రెడ్డి

నెల్లూరు నవంబరు 22(పెన్ పవర్ నెల్లూరు ప్రతినిధి)

అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తే సహించేది లేదనిపరిషత్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి గెలిచి పరిషత్ ఎన్నికల్లో చేసిన అక్రమాలనే గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించే
ప్రయత్నంచంద్రబాబుఅధికారాన్నిఅడ్డుపెట్టుకుని ఎన్నికల్లో
గెలవాలనిచూస్తున్నారు.పరిషత్ఎన్నికల్లోజరిగినఅవకతవకలపైన్యాయపోరాటం చేస్తున్నాం.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేప్రసక్తేలేదు.ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని అధికార బలంతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయాలని చూస్తే సహించేది లేదు.

కూటమినాయకులుప్రజలఓటుహక్కును,ప్రజాస్వామ్యహక్కులనుకాలరాయాలనిచూస్తున్నారు.గ్రామపంచాయతీ ఎన్నికలునిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు.

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ.

పరిషత్ ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి అనేక అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడ్డారని మాజీ మంత్రి,కాకాణి తీవ్రస్థాయిలో విమర్శించారు.

నామినేషన్ల ప్రక్రియ మొదలుకొని నామినేషన్ల పరిశీలన, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు అడుగడుగునా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు.కూటమినాయకులు,కొంత మంది అధికారులు కుమ్మక్కై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను వివిధ రకాలుగా ఇబ్బందులకుగురిచేశారని,ఎన్నికలప్రక్రియను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో సైతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవాల్సిన చోట ఓటమి చెందినట్లు ఫలితాలను తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.

పరిషత్ ఎన్నికల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ఇప్పటికేన్యాయస్థానాలనుఆశ్రయించామని,న్యాయపోరాటంకొనసాగిస్తామని స్పష్టం చేశారు. తప్పు చేసిన ఏ ఒక్క అధికారిని వదిలిపెట్టబోమన్నారు,

ఈరోజుఅధికారంచేతిలోఉందనినాయకులు,అధికారులుఇష్టానుసారంగావ్యవహరిస్తున్నారని,అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కాకాణి హెచ్చరించారు.

ఈరోజు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసే ప్రతి అన్యాయానికి భవిష్యత్తులో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని అన్నారు.పరిషత్ ఎన్నికల్లో ప్రత్యక్షంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఎదుర్కోలేక అధికార యంత్రాంగాన్ని,పోలీసులనుఅడ్డుపెట్టుకునివ్యవహరించిన కూటమి నాయకులు, ఇప్పుడు గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ అదే తరహా రాజకీయాలకు తెరతీస్తున్నారని విమర్శించారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల అభిప్రాయాన్ని మార్చలేరని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పనితీరు ఆధారంగానే తమ నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు.కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటి?:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని కాకాణి ప్రశ్నించారు.

నిత్యావసరవస్తువులధరలురోజురోజుకూపెరిగిపోతున్నాయని, సామాన్య కుటుంబాలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలు తప్ప ప్రజలకు అందించిన ప్రయోజనాలు ఏమిటో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే చేరేవని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక భరోసా లభించేదని గుర్తుచేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు అందక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం:

వ్యవసాయ రంగంలోనూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కాకాణి అన్నారు.

గతంలో జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వ హయాంలో రైతులకు,రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు,పురుగుమందులు అందుబాటులో ఉండేవని, సాగుకు అవసరమైన సహకారం లభించేదని తెలిపారు. పంటలు పండినప్పుడు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతో రైతులు ఆర్థిక భరోసాతో జీవించారని పేర్కొన్నారు.



ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో రైతులు సాగునీరు,ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, కనీసం యూరియా కూడా సకాలంలో అందించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

ధాన్యానికిధరఉన్నప్పటికీ పంటలు పండించుకోవడానికి అవసరమైన నీరు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు అవసరమైన సాగునీరు, ఎరువులు, విత్తనాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఆ బాధ్యతను విస్మరించి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని హితవు పలికారు.గ్రామాల అభివృద్ధికి ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి:ప్రజలు గత ప్రభుత్వ పాలనను, ప్రస్తుత ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకోవాలని కాకాణి సూచించారు. ఏ ప్రభుత్వ హయాంలో సంక్షేమం అందింది? ఏ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు అభివృద్ధి జరిగింది? రైతులకు ఎవరు అండగా నిలిచారు? సామాన్య ప్రజలకు ఎవరు భరోసా కల్పించారు? అనే అంశాలను బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని, గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాలని కోరారు.

కూటమినాయకులు చెప్పే హామీలకు, మాయమాటలకు మోసపోవద్దని,గ్రామాలభవిష్యత్తునుదృష్టిలోపెట్టుకునినిర్ణయంతీసుకోవాలనిపిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినవారిపైచట్టపరంగా పోరాటం కొనసాగిస్తామని కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

కాకాణి వెంకటాచలంపర్యటన సందర్భంగా నాటకం శ్రీనివాసులు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు

4వ వార్డులో జనసేన అభ్యర్థి బాలసుబ్రమణ్యానికి మద్దతుగా విస్తృత ప్రచారం

- కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నేతల ఇంటింటి ప్రచారం

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 22:



శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో 4వ వార్డులో జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఇసుకమట్ల బాలసుబ్రమణ్యం, కూటమి చైర్మన్ అభ్యర్థి పేట బాలాజీ విజయమే లక్ష్యంగా నాయకులు విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ ప్రచార కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త మిద్దెల హరి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మిన్నల్ రవి, 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రాంబాబు, ప్రముఖ క్రిమినల్ న్యాయవాది సాయిరాం విప్పరపల్లి పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులను గెలిపించి వార్డు అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దావాల గిరి, బండి రమేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, 4వ వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

3వ వార్డులో జనసేన ప్రచారానికి హరిప్రసాద్, కొట్టే సాయి ప్రసాద్ మద్దతు

- చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత పసుపులేటి హరిప్రసాద్

శ్రీకాళహస్తి,పెన్ పవర్, నవంబర్ 22:





శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 3వ వార్డులో జనసేన కూటమి అభ్యర్థి గంధం రాగమ్మ విజయాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ

వార్డులోని సమస్యల పరిష్కారంతో పాటు అధిక సంఖ్యలో ఉన్న చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి సహకరిస్తానని, గంధం రాగమ్మను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చంద్రప్ప, జనసేన నాయకులు కుమార్, నరేంద్ర, పేట చంద్ర, పేట చిరంజీవి, పసుపులేటి నవీన్, ఆరిఫ్ తదితరులు, కూటమి నాయకులు, జనసైనికులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

38వ వార్డులో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం



- కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించండి తలపా దామోదరం రెడ్డి

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 22:

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 38వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ, పేద ప్రజల ఆర్థిక అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొంటూ, ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అభ్యర్థులను విజయపథంలో నడిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నెల్లూరు గాంధీ, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, స్వామినాథన్, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల మెడపై కత్తిగా మారిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్



- యాప్‌పై అవగాహన లేక ఎరువుల కోసం రైతుల అవస్థలు.. సకాలంలో ఎరువులు అందక ఇబ్బందులు

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 22:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ (ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సర్వీస్) యాప్ శ్రీకాళహస్తి నియోజకవర్గ రైతులకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన వేళ ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ, యాప్‌లో నమోదు చేసుకోలేక రైతులు సకాలంలో వాటినిపొందలేకఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలోని తూర్పు మండలాల్లో అధికశాతంమంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వరి నాట్లకు సిద్ధమవుతున్న రైతులకు ఎరువుల సేకరణ భారంగా మారింది. నవంబర్ 17 నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల కొనుగోలు చేయాలనే నిబంధన అమల్లోకి రావడంతో, యాప్ వినియోగంపై అవగాహన లేని రైతులు సచివాలయాల్లోని వ్యవసాయ అధికారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకే ఎరువులు సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు మరింత పెరిగాయి.గతంలో రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ అధికారుల సహకారంతో ఎరువులు సులభంగా పొందేవారు. ప్రస్తుతం కొత్త విధానంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు యూరియా సరఫరాను దశలవారీగా తగ్గిస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పరిశ్రమలకు అక్రమ మార్గాల్లో యూరియా తరలిపోతున్నా, రైతులకు మాత్రం సకాలంలో అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలోనూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకోవడంలోనూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు, సాంకేతిక ఇబ్బందులు లేకుండా సబ్సిడీ ధరలపై ఎరువులను సకాలంలో అందించాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా 21, 22 వార్డుల్లో బత్తెయ్య నాయుడు ప్రచారం

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 22:

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గాంధీతో పాటు వార్డు అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. బత్తెయ్య నాయుడు 21, 22వ వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి మధ్యతరగతికుటుంబాలుఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షలు ఇస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగూర్ అయ్యా, సురేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కరాటే పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థిని సత్తా

- కె. స్నేహప్రియకు కాంస్య పతకం.. అభినందనల వెల్లువ

శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,నవంబర్ 22:



పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలోని జీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నవంబర్ 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన కె. స్నేహప్రియ ప్రతిభ చాటింది. సింహపురి కెనీ స్పోర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా శ్రీకాళహస్తి శాఖకు చెందిన ఆమె -30 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించి పట్టణానికి గర్వకారణంగా నిలిచింది.

ఈ సందర్భంగా అకాడమీ వ్యవస్థాపకులు, ప్రధాన శిక్షకులు డా. రెన్ని ధనుష్ స్నేహప్రియను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి సహకరించిన కోచ్‌లు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతి రెడ్డికి మంత్రి నారాయణ జన్మదిన శుభాకాంక్షలు

నెల్లూరు, నవంబరు 22(పెన్ పవర్ నెల్లూరు ప్రతినిధి)

కోవూరు శాసనసభ్యులు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదినం సందర్భంగా నెల్లూరు ఎంపీ కార్యాలయంలో సందడి నెలకొంది.

ఈ ప్రత్యేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరులోని వేమిరెడ్డి ఎంపీ కార్యాలయానికి స్వయంగా విచ్చేసి, ప్రశాంతి రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు భారీ పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందించడంతో కార్యాలయ ప్రాంగణం అంతా కోలాహలంగా మారింది.ప్రజాసేవ పట్ల ప్రశాంతి రెడ్డి గారికి ఉన్న నిబద్ధతను కొనియాడుతూ, భగవంతుని ఆశీస్సులతో ఆమెకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని మంత్రి నారాయణ గారు ఆకాంక్షించారు.





కోవూరు నియోజకవర్గ అభివృద్ధిలోనూ, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలిగా భక్తుల సేవలోనూ ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ప్రధాన అజెండా

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య



శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,నవంబర్ 22:

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని 9, 17వ వార్డుల్లో సీపీఎం అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి, పేదలకు ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి సమస్యలపై పాలకులను ప్రశ్నిస్తూ, పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పుల్లయ్య ప్రజలను కోరారు.ఈ ప్రచారంలో 9వ వార్డు అభ్యర్థి భారతి, 17వ వార్డు అభ్యర్థి ఉస్మాన్ బాషా, గంధం మణి, పెనగడం గురవయ్య, బాలకృష్ణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు.

- మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు ,నవంబర్ 22(పెన్ పవర్ నెల్లూరు ప్రతినిధి)

కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ప్రముఖ నాయకులకు విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ పొంగూరు నారాయణ , టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ బీద రవిచంద్ర రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీ దూండి రాకేష్ నెల్లూరు మేయర్ శ్రీ రూప్ కుమార్ యాదవ్ టీడీపీ నాయకులు శ్రీ కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అంతకుముందు గూడూరు శాసనసభ్యులు శ్రీ పాశం సునీల్ కుమార్ వీపీఆర్ నివాసానికి విచ్చేశారు.



ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మహానందిలో కోటి దీపోత్సవం

- 24న జ్వాలా తోరణం.. కోటి దీపాల వెలుగులు

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో ఈ నెల 24వ తేదీ సోమవారం కార్తీక కోటి దీపోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

సాయంత్రం 6.30 గంటలకు ఆలయ రాజగోపురం ఎదుట జ్వాలా తోరణం వెలిగించి, అనంతరం కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు దేవస్థానం ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు.



ఉయ్యాల ప్రవీణ్ పై అనుచిత ఆరోపణలు సరికాదు

జనసేనా వీర మహిళ

నాయుడుపేట నవంబర్22 పెన్ పవర్ ప్రతినిధి.



నాయుడుపేట సూళ్ళూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నాయుడుపేట ఏ యం సి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌పై వస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు ఉంటే వాటిని ఆధారాలతో నిరూపించాలని, లేనిపక్షంలో తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలకాలని జనసేన సల్మా నాయకులు అన్నారు

వ్యక్తిగత విమర్శలకు స్వస్తి పలకాలని ఆమె అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే ప్రతి అంశాన్ని ప్రజలు వాస్తవాలతో పరిశీలించాలని, రాజకీయ విభేదాల పేరుతో వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించకూడదని సూచించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులపై విమర్శలు చేసినప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.అలా లేని పక్షంలో మీ మా నాయకులు ఉయ్యాల ప్రవీణ్ కు క్షపాణ చెప్పాలని ఆమె గాటుగా విమర్శలు కురిపించారు. జనసేనా అంటే కట్టుబాట్లకు కట్టుబడి ఉండటం జనసేనా నాయకుల లక్ష్యం అనివారు.చెప్పారు. అలా లేని పక్షంలో మీకు మీరు క్షపాణ చెప్పకపోతే మీకు జీవితంలో ఏవ్వరిని విమర్శించే ఆలొచనలకు దూరంలో ఉండే విదంగా మీకు గర్తిండేలా చేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో జనసేనా నాయకులు అభిమానులు వీరమహిళాలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పోటీ వద్దు..

- .ఏకగ్రీవాలకే మొగ్గు.

- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం తరపున రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు.

- వైసీపీ జిల్లా అధ్యక్షుడి మాటలు వింటే మిగిలేది కక్షలు, అప్పులే.

- పారదర్శకంగా ఎన్నికలు జరగబట్టే కడప, పులివెందుల ప్రాంతంలోనూ ప్రజాస్వామ్యం గెలిచింది.

- పులివెందుల నుంచి శ్రీకాకుళం వరకు వైసీపీ తుడిచిపెట్టుకుపోయి కూటమి క్లీన్ స్వీప్ చేసింది.

- నెల్లూరులో మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.



నెల్లూరు, నవంబర్ 22(పెన్ పవర్ నెల్లూరు ప్రతినిధి)

2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ 94 శాతం స్ట్రైక్ రేట్ తో 175కి 164 సీట్లను గెలుచుకున్నాయి

అప్పుడు వైసీపీ నేతలు ఈవీఎంలు, ఈవీఎంలు అని గొంతు చించుకున్నారు

ఇప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది

పులివెందుల నుంచి శ్రీకాకుళం వరకు టీడీపీ, జనసేన, బీజేపీ క్లీన్ స్వీప్ చేసేశాయి

ఈవీఎంలపైన ఏడ్చినోళ్లు.ఇప్పుడు బ్యాలెట్లను ఏమంటారో..కొత్తగా ఏ పద్ధతి తెమ్మంటారో వైసీపీ నేతలకు అర్థం కాని పరిస్థితి

40 ఏళ్ల తర్వాత కడప, పులివెందుల ప్రాంతంలో అత్యంత పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరిగిందిమొన్నటి ఎన్నికల వరకు అక్కడ అంతాదుర్మార్గాలే..నామినేషన్లను వేయనిచ్చేది లేదు...ప్రజలకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించే అవకాశమే లేదు

ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితమైనవి..గ్రామాల్లో అందరూ కూర్చుని రాజకీయాలకు అతీతంగా సర్పంచ్ లను ఎన్నుకుంటే కచ్చితంగా ప్రోత్సహించాలి

పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలను ప్రకటించింది

5 వేలు లోపు జనాభా ఉంటే రూ.15 లక్షలు, 10 వేలు లోపు జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేలు పైన జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షలు అందించనున్నారు

ఉదాహరణకు సర్వేపల్లిలో 117 పంచాయతీలున్నాయి...ఒక 15 పంచాయతీల్లో పోటీ తప్పదనుకుందాం

కనీసం 100 పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే సుమారు రూ.20 కోట్లు ప్రోత్సాహకంగా వచ్చే అవకాశం ఉంది

వైసీపీ జిల్లా అధ్యక్షుడేమో ప్రతి పంచాయతీలో పోటీ ఉండాల్సిందే..పోటీ పడాల్సిందే..తన్నుకోవాల్సిందే..లక్షలు ఖర్చు పెట్టాల్సిందే...అప్పులు పాలుకావల్సిందేనని నాయకులకు హుకుం జారీ చేస్తున్నాడు ఏకగ్రీవం కావడం

తనకుఇష్టంలేదనిచెబుతున్నాడట..ప్రోత్సాహకంగా వచ్చే రూ.15 లక్షలు, రూ.25 లక్షలు, రూ.50 లక్షలు పంచాయతీలకు వద్దంట

ఇలాంటి రాజకీయాలు మేం చేయలేదు..చేయం కూడా...గత పంచాయతీ ఎన్నికల్లోనూ పోటీల విషయంలో బలవంతం చేయలేదు పార్టీ గుర్తులతో జరిగిన ఎన్నికల్లోనే పులివెందులలో సైతం వైసీపీ చేతులెత్తేసింది..ఇప్పుడు పార్టీ గుర్తులు లేకుండా జరిగే ఎన్నికల్లో మాత్రం రెచ్చగొడుతున్నారు

ఏకగ్రీవాల విషయంలో అన్ని పార్టీల నాయకులు సానుకూలంగా ఆలోచించాలని కోరుతున్నాను

పంతాలకు పోయి పోటీలు పెట్టి, లక్షలకు లక్షలు ఖర్చు పెట్టుకోవడంతో పాటు కక్షలు పెంచుకుంటే ఫలితం లేదు

దయచేసి అందరూ రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి గురించి ఆలోచించి ఏకగ్రీవాలను ప్రోత్సహించాలి

పంచాయతీలు ఏకగ్రీవం అయితే ప్రశాంత వాతావరణంలో పల్లెలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందిసీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీలతో పాటు ఎంపీపీలు, జెడ్పీలకు ఒక్క రూపాయి డైవర్ట్ కాకుండా నిధులు వస్తాయి

అందరూ సానుకూల దృక్పథంతో ఆలోచించి ఏకగ్రీవాల దిశగా ముందుకు సాగాలని ప్రార్థిస్తున్నాను

గడ్డివామునకు నిప్పు.. విధ్వంస సంస్కృతిపై శిల్పా ఆగ్రహం-బాధిత రైతుకు పరామర్శ

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22



నంద్యాల జిల్లా గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలో గడ్డివాము దగ్ధమైన ఘటనపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి బాధిత రైతు గోపవరం విజయభాస్కర్‌ను పరామర్శించారు. రాజకీయ కక్షలతో గ్రామాల్లో విధ్వంసాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాంబవరం గ్రామంలోని 5వ వార్డుకు చెందిన వైసీపీ మద్దతుదారుడు విజయభాస్కర్ పశువుల కోసం నిల్వ ఉంచిన గడ్డివాముకు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. పశువుల దాణా కళ్లముందే బూడిద కావడంతో బాధిత కుటుంబం తీవ్ర నష్టంతో ఆవేదన చెందుతోంది.ఈ సందర్భంగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షలతో ఇళ్లపై, పశువుల దాణాపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెడుతూ ప్రజల ఆస్తులను ధ్వంసం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రజలకు మంచి చేసి ప్రజాభిమానంతో ఎన్నికల్లో గెలవాలి కానీ, దాడులు, విధ్వంసాలతో ప్రజలను భయపెట్టాలని చూడటం తగదన్నారు.

గ్రామాల్లో విధ్వంస సంస్కృతికి అడ్డుకట్ట వేయాలని, ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాత్రివేళల్లో పోలీస్ నిఘా ముమ్మరంనేరాల నియంత్రణకు విస్తృత తనిఖీలు



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతర నిఘా కొనసాగిస్తూ అనుమానిత వ్యక్తులు, వాహనాలపై తనిఖీలు ముమ్మరం చేశారు.

రాత్రి వేళల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రహదారులపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

వైసిపి నాయకులపైవిరుచుకుపడ్డ కూటమి నాయకులు



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం ఆళ్లగడ్డ తాలూకా సిరివెళ్ల మండల కేంద్రంలోని వైసిపి నాయకులపైవిరుచుకుపడ్డ కూటమి నాయకులు

సిరివెళ్ల తెలుగుదేశం నాయకులు కాబోయే సర్పంచ్ ముల్లా మహమ్మద్ హుస్సేన్ బీసీ ఫిదా హుస్సేన్ వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా అన్ని పదవులలో ఉండి సిరివెళ్ల మీరు ఏం అభివృద్ధి చేశారు ఏ అభివృద్ధి జరిగినా భూమా కుటుంబంతోనే అని షాది ఖానా గాని కస్తూర్బా స్కూల్ గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి జరిగాయి అదే విధంగా మీ పదవులు వచ్చిన తర్వాత మీ ఇళ్లకు రోడ్డు మీ పొలాలకు రోడ్డు తప్ప మీరు చేసింది ఏమీ లేదు ప్రజలు తమ అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ప్రజలు తమ ఓటును తెలుగుదేశం అభ్యర్థి ముళ్ళ మహమ్మద్ హుస్సేన్ గొలుసు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

మయూరి వెంకటేశ్వర్లు పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22:

నంద్యాల పట్టణం నూనెపల్లె రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసముంటున్న మయూరి వెంకటేశ్వర్లు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం నాడు మంత్రి ఎన్ఎండి ఫరూక్ నూనెపల్లె రైల్వే స్టేషన్ రోడ్డులోని మయూరి వెంకటేశ్వర్లు స్వగృహానికి వెళ్లి, వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో మునిగి ఉన్న వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి ఫరూక్ భరోసా కల్పించారు. మయూరి వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బాబన్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా వ్యాప్తంగా నిరంతర విస్తృత తనిఖీలు రాత్రి వేళల్లో కట్టుదిట్టమైన పోలీస్ నిఘా.

- నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక భద్రతా చర్యలు....

- జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీస్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీస్ ఆదేశాలమేరకు ప్రతిరోజూ విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలభాగంగా రాత్రి వేళల్లో అనవసరంగా సంచరించే వ్యక్తులు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ రాత్రి పహారా (నైట్ పెట్రోలింగ్) ను మరింత కట్టుదిట్టం చేశారు. రాత్రి వేళల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులతో పాటు



ఇతర ప్రధాన రహదారులపై రాత్రి వేళల్లో సరుకు రవాణా చేసే వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా వాహనదారుల అలసట కారణంగా ప్రమాదాలు జరగకుండా "స్టాప్ ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం ద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన చోట విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించేలా సూచిస్తున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.



అలాగే అనుమానిత వ్యక్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, ఆకతాయిలు మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి కదలికలను నియంత్రించేందుకు సీ.సీ.ఎస్ (క్రైమ్ కంట్రోల్ స్పెషల్) బృందాల సహకారంతో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలుని చేపడుతున్నారు.

?ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా నంద్యాల జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోంది. నేరాల నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

రేపు బేతంచెర్లలో వైస్సార్సీపీ విజయోత్సవ ర్యాలీ



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల జిల్లా బేతంచెర్ల ఈ నెల 3వ తేదీన జరిగిన బేతంచెర్ల నగర పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరపున చైర్మన్ అభ్యర్థి దూదేకుల దస్తగిరితో పాటు 18 వార్డుల్లో విజయం సాధించిన కౌన్సిలర్లతో 23 నవంబర్ 2026 సోమవారం ఉదయం 08:00 గంటలకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ మండల నాయకులు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వైస్సార్సీపీ కార్యాలయం నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరుచున్నాము.

గమనిక: రేపు ఉదయం 08:00 గంటలకువైస్సార్సీపీ కార్యాలయం దగ్గరికి రావాలని కోరుచు న్నాము.

వైయస్ఆర్సీపీ కార్యకర్తలపై తెలుగుదేశం వర్గీయులు దాడి



నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల జిల్లా చాగలమర్రి లో 17వ వార్డులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ప్రచారం నిర్వహిస్తున్న వార్డు మెంబర్ ముల్లా బురానుద్దీన్ మరియు వైఎస్సార్సీపీ కార్యకర్తల పై తెలుగుదేశం పార్టీ వర్గీయులు దాడికి పాల్పడి గాయపరిచారు. ఈ



ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల నాని ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.....

నంద్యాల 52వ వార్డు వైయస్సార్ నగర్ లో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్, మున్సిపల్ చైర్మన్ బాబన్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 22

నంద్యాల పట్టణ శివారులో ఉన్న 52వ వార్డు ఇంచార్జ్ మరాటి సూరి ఆధ్వర్యంలో శనివారం టిడిపి కార్యాలయాన్ని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎమ్ డి ఫిరోజ్ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బాబన్ ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా వార్డు ఇన్చార్జి మరాటి సూరి మాట్లాడుతూ వైయస్సార్ నగర్ లో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఎన్ఎండి ఫిరోజ్ కు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బాబన్ కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మొన్న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో కేవలం రెండు ఓట్ల తేడాతోనే ఓడమని కానీ నైతిక విజయం మాదేనని గతంలో కంటే మెజారిటీని బాగా తగ్గించామని మమ్మల్ని మా పరిస్థితిని చూసి కూడా మమ్మల్ని ఎంతో ఎంకరేజ్ చేసి టికెట్ ఇచ్చిన మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ఎన్ ఎండి ఫిరోజ్ కు ఎన్ ఎండి ఫయాజ్ కు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి



ఫిరోజ్ మాట్లాడుతూ వైయస్సార్ నగర్ లో ఇంచార్జ్ మరాఠి సూరి ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మొన్న జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో రెండు ఓట్ల తేడాతో ఓడిన వైయస్సార్ నగర్ లో ఎక్కడ అభివృద్ధి నిలుపుదల ఉండదని ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొని రావాలని అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బాబన్ మాట్లాడుతూ 52వ వార్డు అభివృద్ధి విషయంలో మరాటి సూరి ఎప్పుడైనా నాతో వచ్చి పనులు చేయించుకోవచ్చు అని నంద్యాల పట్టణ అభివృద్ధి తో పాటు వైయస్సార్ నగర్ అభివృద్ధి కూడా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నెల్లూరు నగర నూతన మేయర్‌గా పి. రూప్ కుమార్ ప్రమాణ స్వీకారం

పెన్ పవర్ నవంబర్ 22 నెల్లూరు జిల్లా నెల్లూరు బ్యూరో



నెల్లూరు: నెల్లూరు నగరపాలక సంస్థకు నూతన మేయర్‌గా పి. రూప్ కుమార్ నేడే బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఉదయం 11 గంటలకు నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి సంబంధించి మేయర్ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆహ్వానం అందింది. నూతన మేయర్‌గా పి. రూప్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన మేయర్‌కు శుభాకాంక్షలు తెలియజేయాలని మేయర్ కార్యాలయం కోరింది.నెల్లూరు నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, నగర సమస్యల పరిష్కారంలో నూతన మేయర్ కీలక పాత్ర పోషిస్తారని నగర ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చీరాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి
కూటమి కౌన్సిలర్లకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య దిశానిర్దేశం

చీరాల, నవంబర్ 22, పెన్ పవర్, నవంబర్ 22

పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సూచించారు. ఆదివారం చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి కౌన్సిలర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన నూతన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం జరగనున్న నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.



ముఖ్యంగా యువ కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అజెండా అంశాలపై పూర్తి అవగాహనతో చర్చల్లో పాల్గొనాలని, ప్రజలకు అవినీతికి తావులేకుండా పారదర్శకంగా, నిజాయితీతో ప్రజాసేవ అందించాలని స్పష్టం చేశారు.అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంపిక విషయంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని పారదర్శకంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల గౌరవానికి భంగం కలగకుండా చూస్తామని పేర్కొన్నారు.
చీరాల పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రజాప్రతినిధులంతా ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పిలుపునిచ్చారు.

ఎన్నికల నేపథ్యంలో గవినివారిపాలెంలో పోలీసుల కవాతు
ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి -- డీఎస్పీ ఎం.డి. మొయిన్



చీరాల, నవంబర్ 22, (పెన్ పవర్) :

పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ఓటర్లలో భద్రతా భావం కల్పించే లక్ష్యంతో చీరాల మండలం, గవినివారిపాలెం గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ పర్యవేక్షణలో సీఐ సుధాకర్, పోలీసు సిబ్బంది ఈ కవాతులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
ప్రజలుఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగాతమఓటుహక్కునువినియోగించుకోవాలని సూచించారు.
ప్రశాంతమైన పోలింగ్‌కు అవసరమైన అన్ని భద్రతాఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.గతంలో చీరాల మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన విధంగానే రానున్న పంచాయతీ ఎన్నికలను కూడా విజయవంతం చేయాలని కోరారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఓటర్లు కేంద్రాల వద్ద గుమిగూడకుండా వెళ్లిపోవాలని, ఓట్ల లెక్కింపు సమయంలోనూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్డీయే కూటమి కార్పొరేటర్ల ప్రమాణస్వీకార మహోత్సవ ఆహ్వానం ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 22,

నగరపాలక సంస్థ మేయర్‌గా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 30 మంది కార్పొరేటర్ల ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగారేపు అనగా ది.23-11-2026, సోమవారం ఉదయం 9.00 గం.లకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం(శ్రీనివాసరావుపేట)లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎన్డీయే కూటమి కార్పొరేటర్లు పూలమాలలు వేసి ప్రమాణస్వీకార మహోత్సవానికి బయలుదేరడం జరుగుతుంది
కావున గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుచున్నాము.





పి.జి.ఆర్.ఎస్ రద్దు కలెక్టర్ యం.సాయికాంత్ వర్మ

గుంటూరు, పెన్ పవర్,నవంబరు 22 :

ఎన్నికల విధులలో జిల్లా యంత్రాంగం నిమగ్నం కావడం వలన మరియు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండటం వలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పూర్తి అయ్యేవరకు పి.జి.ఆర్.ఎస్ ను రద్దు చేయడం జరిగిందని చెప్పారు. ఈ అంశాన్ని ప్రజలు గమనించి సోమవారం వ్యయప్రయాసలకు ఓర్చి రావద్దని విజ్ఞప్తి చేశారు.

కారంపూడి 6వ వార్డు అభ్యర్థిగా తోట లక్ష్మి నామినేషన్

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల నవంబర్ 22

పల్నాడు జిల్లా కారంపూడి గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ రోజు నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనిస్టేజ్-1 కార్యాలయంలో 6వ వార్డు అభ్యర్థిగా తోట లక్ష్మి (బి/శి తోట నరసింహారావు (అబ్బాయి) నామినేషన్ దాఖలు చేశారు.
సీనియర్ నేత తోట నరసింహారావు గారి సతీమణి అయిన తోట లక్ష్మిని, గ్రామపంచాయతీనిఅభివృద్ధి పథంలో నడిపించాలన్న లక్ష్యంతో కూటమి సభ్యులు ఏకగ్రీవంగా 6వ వార్డు అభ్యర్థిగానియమించారు.
ఈ సందర్భంగా పలువురు పెద్దలు, కూటమి నాయకులు ఆమెను అభినందిస్తూ రిటర్నింగ్ అధికారి బాబు నాయక్ గారికి నామినేషన్ పత్రాలనుఅందజేశారు. గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.



రామన్నపేట సర్పంచ్ అభ్యర్థిగా లుక్కా ఏలేసు నామినేషన్

గూడూరు పెన్ పవర్, నవంబర్ 22

గూడూరు మండలం రామన్నపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి లుక్కా ఏలేసు ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకంతో సర్పంచ్‌గా గెలిపిస్తే రామన్నపేట గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గుంటూరు జీఎంసీ ప్రత్యేక సమావేశం రేపు.. మేయర్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, డిప్యూటీ మేయర్ ఎన్నిక

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 22,

నగరపాలక సంస్థ ప్రత్యేక సమావేశం సోమవారం నవంబర్ 23న ఉదయం 11 గంటలకు జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో నూతన మేయర్ కోవెలమూడి లక్ష్మి అపర్ణ, 76 మంది వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనుండగా, అనంతరం డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించే ఈ ప్రత్యేక సమావేశానికి గుంటూరు జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ సి.ఎం. సాయికాంత్ వర్మ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. సమావేశంలో 76 మంది వార్డు సభ్యులు, మేయర్, 8 మంది ఎక్స్-అఫీషియో సభ్యులు కలిపి మొత్తం 85 మంది ఓటు హక్కు కలిగి ఉండగా, సమావేశ నిర్వహణకు 43 మంది సభ్యుల కోరం అవసరం.
కోరం నిర్ధారణ అనంతరం ముందుగా నూతన మేయర్ కోవెలమూడి లక్ష్మి అపర్ణ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ వెంటనే 76 మంది వార్డు సభ్యులు సామూహికంగా ప్రమాణ స్వీకారం



చేస్తారు. అనంతరం రాజకీయ పార్టీల విప్‌ల ప్రకటన తర్వాత ప్రత్యక్షంగా ఎన్నికైన వార్డు సభ్యుల నుంచి చేతులెత్తే పద్ధతిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించనున్నారు. అభ్యర్థులను సభ్యులు ప్రతిపాదించి, బలపరచాల్సి ఉంటుంది. ఒకే అభ్యర్థి పోటీలో ఉంటే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించనున్నారు.సమావేశానికి సంబంధించి ఉదయం 9 గంటల నుంచే సభ్యుల గుర్తింపు కార్డుల పరిశీలన, హాజరు నమోదు ప్రారంభం కానుంది. ఫారం-ఎ, ఫారం-బి, విప్ ప్రతుల సమర్పణకు ఉదయం 10 గంటల వరకు గడువు నిర్ణయించారు. ఉదయం 11:05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం, 11:25 గంటలకు డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమై, మధ్యాహ్నం 12:10 గంటల కల్లా సమావేశం ముగిసేలా ఏర్పాట్లు చేశారు.
కౌన్సిల్ హాలులో 88 సీట్లు ఏర్పాటు చేయడంతో పాటు మేయర్, ఎక్స్-అఫీషియో సభ్యులకు ముందు వరుసలో సీట్లు కేటాయించారు. రాజకీయ పార్టీలకు ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు, డిస్‌ప్లే బోర్డులు, మీడియా ప్రతినిధులకు బారికేడ్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కౌన్సిల్ హాలు పరిసరాల్లో పోలీసు బందోబస్తు, బారికేడింగ్ ఏర్పాటు చేసి, పాస్‌లు కలిగిన సభ్యులకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు.
సమావేశం మొత్తం వీడియోగ్రఫీ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. సభ్యులందరూ ఉదయం 9 గంటలకల్లా గుర్తింపు కార్డులతో హాజరై, సమావేశం ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు, జీఎంసీ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పేదరికంపై భారత్ సాధించిన విజయం.. మార్పుకు నాంది
పలికిన దశాబ్దం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 22,

భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరిక నిర్మూలన దిశగా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 2011 నుంచి 2023 మధ్య దాదాపు 50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడగా, అత్యంత తీవ్రమైన పేదరికం దాదాపుగా నిర్మూలించబడిందని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించిందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అంత్యోదయ స్ఫూర్తితో చివరి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించే లక్ష్యంతో పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు పేద



కుటుంబాలకు ఆరోగ్యం, గౌరవం, ఆర్థిక భద్రత కల్పిస్తున్నాయని వివరించారు.
జన్ ధన్ ఖాతాలు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా ప్రభుత్వ సహాయం నేరుగా లబ్ధిదారులకు చేరుతోందని, ముద్ర రుణాలు, స్వనిధి, విశ్వకర్మ పథకాలతో చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.
మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని, 3.7 కోట్లకు పైగా మహిళలు లక్షపతి దీదీలుగా మారడం విశేషమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు పేదరిక నిర్మూలనతో పాటు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవకాశాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు.

మృతురాలి కుటుంబానికి డిఎన్ఆర్ ఆర్థిక చేయూత

పెన్ పవర్, నవంబర్, 22,

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం మాధారం గ్రామానికి చెందిన మేకలు మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు.
విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి (డిఎన్ఆర్) మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5000/- అందజేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, (డిఎన్ఆర్) యువసేన సభ్యులు ఉన్నారు.



గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం
కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా సమ్మెట రమ్య నామినేషన్

గూడూరు, పెన్ పవర్, నవంబర్ 22

మండలంలోని ముక్కొల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి బలపరిచిన సమ్మెట రమ్య నామినేషన్ దాఖలు చేశారు. ముక్కొల్లు పీఏసీఎస్ చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్ (నాని) సతీమణి అయిన ఆమె గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామంలో దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధిస్తానని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎండపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పిన్నింటి రాజ్యలక్ష్మి నామినేషన్

కృత్తివెన్ను, పెన్ పవర్, నవంబర్ 22

మండలంలోని ఎండపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పిన్నింటి రాజ్యలక్ష్మి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసుకుంటానని తెలిపారు. నామినేషన్ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు,

నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

జైలు - బెయిల్ రాజకీయాల కోసం పొత్తు పెట్టుకోలేదు: వైసీపీపై నిప్పులు చెరిగిన చంద్రబాబు



కేంద్రానికి అందిస్తున్న మద్దతుతో ప్రధాని మోదీని బ్లాక్‌మెయిల్ చేసే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే బీజేపీతో కలిసి పనిచేస్తున్నామని, కేంద్రం ఏపీకి అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. అమరావతి అభివృద్ధి, పెట్టుబడులు, జల్ జీవన్ మిషన్, విశాఖ డేటా సెంటర్‌కు కేంద్రం మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. వైసీపీ నేతల బ్లాక్‌మెయిల్ సలహాలను తప్పుబట్టారు.

కేంద్ర ప్రభుత్వానికి తాము అందిస్తున్న మద్దతును అడ్డుపెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బ్లాక్‌మెయిల్ చేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తమ మద్దతును ఆసరాగా చేసుకుని కేంద్రం ముందు గొంతెమ్మ కోరికలు కోరాలని వైసీపీ నాయకులు సలహాలు ఇస్తున్నారంటూ ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయలేదని, ఇప్పుడు కూడా అదే పంథాలో విలువలకు కట్టుబడి ముందుకు సాగుతానని తేల్చిచెప్పారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏం తక్కువ చేసిందని ప్రశ్నించిన చంద్రబాబు, అన్ని విధాలా అండగా నిలుస్తున్న ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలన్న ఆలోచనే అత్యంత దుర్మార్గమని వ్యాఖ్యానించారు. అసలు వైసీపీ నేతలకు ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తాయో కూడా అర్థం కావడం లేదని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసి మురగబెడితే, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం వాటిని తిరిగి పునరుద్ధరించిందని గుర్తుచేశారు. కేంద్రం నుంచి అందుతున్న సంపూర్ణ సహకారంతో ఆర్థిక కష్టాల నుంచి ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని వివరించారు.

దేశానికి వస్తున్న పెట్టుబడులలో 25 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కేలా ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని సీఎం వెల్లడించారు. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహాయం అందరికీ తెలిసిందేనని, పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమరావతికి తీసుకొస్తున్నారని తెలిపారు. ఆయా సంస్థల ఉద్యోగుల నివాస గృహాల నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభం కానుందని చెప్పారు. అలాగే, జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్రంలోని గ్రామాలకు నీటి సౌకర్యం కల్పిస్తున్నారని, విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామంటే తక్షణమే అనుమతులు మంజూరు చేశారని ప్రస్తావించారు.

రాజకీయంగా బీజేపీ సిద్ధాంతాలు వారికి ఉంటాయని, తమ సిద్ధాంతాలు తమకు ఉంటాయని, అయినప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసమే ఇరువురం చేతులు కలిపామని చంద్రబాబు స్పష్టం చేశారు. మోదీ బలమైన నాయకుడని తాను ఇప్పుడు కొత్తగా చెప్పడం లేదని, 2014 ఎన్నికల కంటే ముందు నుంచే తనకు ఆయనతో పరిచయం ఉందని, అప్పుడే ఆయన్ను బలమైన నాయకుడిగా ప్రకటించానని తెలిపారు. కావాలంటే పాత రికార్డులు చూసుకోవచ్చని పరోక్షంగా వైసీపీ నేతలకు చురకలంటించారు. గతంలో తమ మధ్య విభేదాలు వచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించిన చంద్రబాబు, ఆ విభేదాలు కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల కోసమే వచ్చాయని, వైసీపీ అధినేత జగన్‌లా వ్యక్తిగత ప్రయోజనాల కోసమో, 'జైలు – బెయిల్' రాజకీయాల కోసమో కాదని పరోక్షంగా నిప్పులు చెరిగారు. స్వార్థపూరిత రాజకీయాలు చేసే ఇలాంటి నేతలు ఉన్నంత కాలం ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన హితవు పలికారు.

బాండ్ పేపర్లు.. రూ.కోట్ల ఆఫర్లు : పంచాయతీ ఎన్నికల్లో హామీల జాతర



ఏపీ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్పంచ్ అభ్యర్థులు భారీ హామీలు ఇస్తున్నారు. అనంతపురం నేమకల్లులో గెలిస్తే పుట్టే ఆడబిడ్డలకు రూ.10 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని ఓ అభ్యర్థిని ప్రకటించారు. మరికొందరు రెండెకరాల భూమి, రూ.1.50 కోట్ల వరకు గ్రామాభివృద్ధి నిధులు ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు జనాభా ఆధారంగా రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది.

ఏపీ పంచాయతీ ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు వినూత్న హామీలతో దూసుకుపోతున్నారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి గ్రామ పెద్దగా బాధ్యతలు చేపట్టాలనే కుతూహలం ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం ఎవరూ ఊహించని హామీలు ఇస్తుండగా, మరికొందరు ప్రచారాన్ని హోరెత్తిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదేసమయంలో గ్రామాల్లో సహృద్భావ వాతావరణం ఉండాలని, సామరస్యపూర్వకంగా ఎన్నికలు జరగాలని ఎన్నికలు ఏకగ్రీవం చేసుకోవాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గ్రామ జనాభా ఆధారంగా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. అయితే కొన్నిచోట్ల పోటీ తీవ్రంగా ఉండటంతో అభ్యర్థులు ఆకర్షించే హామీలతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా నేమకల్లు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిని తాను గెలిచిన తర్వాత పుట్టే ఆడబిడ్డల కోసం రూ.10 వేలు ఫిక్సడ్ డిపాజిట్ చేస్తానంటూ ప్రకటించారు. ప్రస్తుతం ఈ హామీ వైరల్ అవుతోంది. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అంతటితో ఆగకుండా తన హామీలు అమలు చేసే విషయంలో మాట తప్పనంటూ రూ.10 బాండ్ పేపరుపై రాసివ్వడం గమనార్హం. ఇక శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం రూరల్ మండలం కేసుపురం సర్పంచ్ అభ్యర్థి గుజ్జు రిషా కూడా గ్రామ సమస్యల పరిష్కారంపై బాండ్ పేపరు రాసివ్వడం విశేషంగా ఆకట్టుకుంటోందని అంటున్నారు.

భూములు, కోట్ల రూపాయల ఆఫర్లు

మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యేందుకు ఆశావహులు భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కాకినాడ జిల్లా రౌతులపూడిలో ఓ అభ్యర్థి తనకు సర్పంచ్‌గా అవకాశం ఇస్తే గ్రామ అభివృద్ధి కోసం తన భార్య పేరుపై ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిని రాసిస్తానని

ప్రకటించారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే డంపింగ్ యార్డ్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కోసం రూ. 1.50 కోట్లు సొంత నిధులు ఖర్చు చేస్తానని ఒక అభ్యర్థి ముందుకు వచ్చారు. అదేసమయంలో పలు గ్రామాల్లో రూ. 15 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు నగదు, దేవాలయాల అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీలు ఇస్తున్నారు. చక్రాయపాలెం గ్రామంలో రూ. 51 లక్షలకు ఏకగ్రీవ ఒప్పందం జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. అదేవిధంగా శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం చందకచర్ల సర్పంచ్ పదవికి తనను ఎన్నుకుంటే పంచాయతీకి రూ.1.50 కోట్లు జమ చేస్తామని భూమానంద ఆశ్రమ వ్యవస్థాపకుడు ధనంజయస్వామీజీ సంచలన ప్రకటన చేశారు.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

ఇక ఏకగ్రీవ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం జనాభా ఆధారంగా ప్రోత్సాహక నిధులను పెంచింది. 5,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 15 లక్షలు, ఐదు నుంచి 10,000 జనాభా ఉంటే రూ. 25 లక్షలు, 10,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ. 50 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు అందించనుంది. అయితే, ఈ ప్రక్రియ ఎవరి పోటీ చేసే హక్కుకు లేదా ఓటర్ల స్వేచ్ఛకు ఆటంకం కలిగించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

వరుణుడా.. మజాకా.. చలికాలంలోనూ తుఫాన్ల వెబ్ సిరీస్.. క్లైమాక్స్ ఎప్పుడో?



నవంబర్, డిసెంబర్‌లోనూ బంగాళాఖాతంలో వరుస తుఫాన్ల ముప్పు పొంచి ఉంది. ఈ నెలాఖరులో దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడి, డిసెంబర్ 4 తర్వాత శ్రీలంక, దక్షిణ తమిళనాడు వైపు వెళ్లే అవకాశం ఉందని అంచనా. డిసెంబర్ రెండో వారంలో మరో తుఫాను ఏర్పడే సూచనలున్నాయి. ఎల్‌నినో ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చని నిపుణులు చెబుతున్నారు.సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలలు వచ్చాయంటే మనకు గుర్తొచ్చేది ఏంటి? చల్లటి గాలులు.. పొద్దున్నే పొగమంచు.. బీరువాలో దాచిన స్వెటర్లు.. వేడివేడి టీ కప్పులు.. కానీ మన బంగాళాఖాతం మాత్రం అవేవీ కుదరవు బాబూ.. నాకు చలికాలం అంటే అలర్జీ అంటోంది. ప్రకృతి క్యాలెండర్‌లో సీజన్ మారినా వరుణదేవుడి మూడ్ మాత్రం అస్సలు మారడం లేదు. వర్షాకాలం అయిపోయిందని గొడుగులు అటకెక్కించిన జనానికి పిక్చర్ అభీ బాకీ హై అంటూ వరుస తుఫాన్లతో చుక్కలు చూపిస్తోంది వాతావరణ శాఖ.

ఇప్పటికే ఆర్నబ్ , మురుసు తుఫాన్ల దెబ్బకు వణికిపోయిన ఏపీ ప్రజలకు, మొన్నటికి మొన్న ఆక్వాన్ తుఫాను రూటు మార్చుకోవడంతో కాస్త ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికింది. హమ్మయ్య ఇక ఈ ఏడాదికి గండం గడిచిందిరా బాబూ అనుకునేలోపే బంగాళాఖాతం మళ్లీ తన విశ్వరూపం చూపించడానికి రెడీ అవుతోంది. వాతావరణ నిపుణుల తాజా అంచనాల ప్రకారం.. వరుణుడి డైరీలో ఇంకా రెండు పెద్ద ఎపిసోడ్లు పెండింగ్‌లో ఉన్నాయట.. ఈ నెలాఖరులో దక్షిణ అండమాన్ సముద్రంలో ఓ అల్పపీడనం పుట్టుకురాబోతోంది. ఇది కాస్తా బలపడి తుఫానుగా మారితే డిసెంబర్ 4 తర్వాత శ్రీలంక, దక్షిణ తమిళనాడు వైపు దూసుకెళ్లే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఇక్కడితో కథ ముగిసిందనుకుంటే పొరపాటే.. డిసెంబర్ రెండో వారంలో మరో తుఫాను కూడా లైన్‌లో ఉందట. కాకపోతే దాని రూటు.. రేంజ్ ఏంటనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా లాగా మిస్టరీగానే ఉంది.

ఒకవైపు తుఫాన్లు భయపెడుతుంటే మరోవైపు ఎల్‌నినో తన ప్రతాపాన్ని చూపిస్తోంది. సాధారణంగా ఎల్‌నినో వస్తే వర్షాలకు బ్రేకులు పడతాయని అంటారు. కానీ ఇక్కడ సముద్రం లోపల జరుగుతున్న కథే వేరు. భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు చెప్పిన లెక్కల ప్రకారం.. సముద్ర అంతర్భాగంలో సాధారణం కంటే దాదాపు 4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ వేడి నమోదవుతోందట. సముద్రం లోపల అంత వేడిగా ఉంటే పైన తుఫాన్లు పుట్టకుండా ఎలా ఉంటాయి మరి? 2027 మార్చి వరకు ఈ ఎల్‌నినో ప్రభావం 87 నుంచి 100 శాతం వరకు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు తేల్చిచెప్పేశారు. అంటే ఇప్పట్లో వాతావరణం ఒక కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ప్రస్తుతానికి చలికాలంలో రెయిన్‌కోట్లు వేసుకుని తిరగాల్సిన పరిస్థితి కనిపిస్తున్నా వచ్చే ఏడాదికి మాత్రం కాస్త తీపి కబురు ఉంది. 2027 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య వాతావరణం కాస్త శాంతించి తటస్థంగా మారవచ్చట. ఆ తర్వాత జూన్ నుంచి ఆగస్టు మధ్య లానినా ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే 2027 నైరుతి రుతుపవనాల సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతన్నల కళ్లలో ఆనందం నిండే అవకాశం ఉంది.ఈ ఏడాది చలికాలం మనకు స్వెటర్లతో పాటు గొడుగులను కూడా ఒకేసారి వాడే అరుదైన అవకాశాన్ని కల్పిస్తోంది. బంగాళాఖాతం పెడుతున్న ఈ వరుస ట్విస్టులు ఎటు దారితీస్తాయో తెలియాలంటే వాతావరణ శాఖ ఇచ్చే తదుపరి అప్‌డేట్స్ కోసం వేచి చూడాల్సిందే. అప్పటివరకు చలికి వణుకుతూనే వర్షానికి తడవకుండా జాగ్రత్త పడటం బెటర్..

టెన్షన్ ఎందుకు...లైట్ తీస్కో బ్రో !



పోటీ ప్రపంచంలో విజయం కోసం పరుగులు తీస్తూ మనశ్శాంతిని కోల్పోతున్న ఈ తరానికి భగవద్గీత సందేశం ఎంతో అవసరం. కష్టపడి పనిచేయాలి కానీ ఫలితం గురించి అతిగా ఆలోచించకూడదు. అపజయాలను జీవితానికి ముగింపుగా కాకుండా పాఠాలుగా స్వీకరించాలి. కెరీర్‌లో ఎదుగుదలతో పాటు సంతృప్తి, మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యం ఇచ్చినప్పుడే జీవితం ఆనందంగా సాగుతుంది.

ఈ రోజున పోటీ ప్రపంచం నడుస్తోంది. ఎక్కడ చూసినా ఒకరిని ఒకరు అధిగమించాలన్న ఆరాటం. తామే ముందుకు రావాలని నిరంతర పోరాటం. ఈ అలుపు సొలుపుల పరుగు పందెంలో విలువైనది ఎంతో కోల్పోతోంది ఈ తరం. అదే మనశ్శాంతి. ఉరుకులతో సాగే జీవితంలో తామేంటో కూడా తెలుసుకోలేనంతగా మనసు గిర్రున తిరిగేస్తోంది. దానికి ఏ కొలమానం కాలమానం కూడా లెక్క కట్టేందుకు లేదు అన్నది నిజం. ఫలితం ఏమిటి అంటే యమ టెన్షన్. ఇది అసలుకు వడ్డీలు చక్ర వడ్డీలు కడుతూ చివరికి సాధించేది ఏమిటి అంటే మానసిక శారీరక అనారోగ్యం. కొన్ని సార్లు ఫలితాలు సాధించి విజయవంతం అయినా కూడా ఆస్వాదించేంతగా మనసు ఉండటం లేదు, అది కుదుట పడకుండా శాంతి ఎక్కడ నుంచి వస్తుంది. అందుకే చిన్న వయసులోనే బీపీ షుగర్ తో బతుకు బండి గాడి తప్పుతోంది.

ూతీఱ్అటఅఝశ్రీ ×ఱ్వశ్రీఅస్త్రవఅఎవ బంవం

కూసింత అవసరం :

ముదిమి వయసులోనే వేదాంతం అని కాదు, ఏ ఏజ్ లో అయినా అది ఉంటే మనిషికి సుఖం ఉంటుంది. అలాగని వేదాంతాన్నే నమ్ముకుని కాళ్ళు చాపుకుని కూర్చోమని కాదు, చేయాల్సిన పని నికరంగా నిజాయతీగా చేయాల్సిందే. అందులో అణు మాత్రం కూడా అనుమానం లేదు, ఎంత శక్తి ఉందో అంతగానూ ఉపయోగించాలి. అలాగే ఎంత టాలెంట్ ఉందో దానిని అంతా వాడాలి. ఆ మీదట మాత్రం రిజల్ట్ కోసం టెన్షన్ పడకుండా దానికి అలా వదిలేయడమే బెటర్. ఈ ముఖ్యమైన సూత్రం అన్నది నవీన తరానికి చాలా అవసరం. లేకపోతే ఫలితం ఎలా వస్తుందో అన్నది ఒక బాధ అయితే అది పూర్తిగా విజయవంతం కావాలని సక్సెస్ మాత్రమే దక్కాలని మనసు పడే వేదనతో ఒకవేళ ప్రతికూలత వచ్చినా స్వీకరించలేని మనోదౌర్బల్యం కూడా ఏర్పడుతుంది. దాంతో ఎంతటి వారు అయినా నిలువునా నీరసించి కృంగి పోవడమే కాదు నేలకు జారిపోవడమూ జరుగుతుంది. దాంతో ఒక ఫెయిల్యూర్ కే మొత్తం జీవితాన్ని పందెం కట్టి ఫ్యూచర్ ని లేకుండా చేసుకోవడం జరుగుతుంది.

అది ఒక పాఠం :

చాలా మంది భగవద్గీతను ఆధ్యాత్మిక గ్రంధంగానే చూస్తారు. అంతే కాదు దానికి చనిపోయిన వారి శవాల ముందు వినిపించే ఒక సత్కార్యం గా భావిస్తారు. కానీ నిజానికి అది తప్పు. జ్ఞాన బోధ కోసం అది భగవానుడు కృష్ణుడు అర్జునుడికి చెబుతున్నట్లుగా మానవాళి మొత్తానికి ఇచ్చిన దివ్య సందేశం. అందులో ఫిలాసఫీ లేదు, కెరీర్ కి సంబంధించిన గొప్ప సూత్రాలు ఉన్నాయి. ఇంతకీ కృష్ణుడు చెప్పింది ఏమిటి అంటే నీవు నీ పనిని పూర్తి చెయ్, ఫలితం గురించి ఆలోచన చేయకు అని. అంటే ఫలితం మీద నీకు అధికారం లేదని ఏనాడో అయిదు వేల సంవత్సరాల క్రితమే భగవానుడు చెప్పేశాడు. అయినా అర్థం చేసుకోని వారే మిడి మిడి జ్ఞానంతో ఫలితం మీద లేని పోని ఆశలు పెట్టుకుని అందులో నుంచి నిరాశనే చివరికి అందుకుంటారు.

సంతృప్తి ముఖ్యం :

ఎవరికైనా సంతృప్తి అన్నది ముఖ్యం. ఇక్కడ కూడా చాలా మందికి సందేహం వస్తుంది. అలాగని ఎక్కడో ఆగిపోతే కెరీర్ ఎదుగూ బొదుగూ లేకుండా అక్కడే ఆగిపోతుందని. ముందే చెప్పినట్లుగా చేసే పనిలో నిష్ట నిబద్ధత చూపిస్తూ నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. అదే క్రమంలో తాము తన ప్రస్తుత జీవితం మీద అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పోతే అది చివరికి వారి మీద వారికే నమ్మకం కోల్పోయే చేస్తుంది అన్నదే ఇక్కడ ఆలోచించాలి. అంటే బెటర్ లైఫ్ కోసం ఎప్పటికప్పుడు ఆలోచిస్తూనే దానిని నిరాశతో అసంతృప్తి అన్న ప్రతిబంధకాలతో తాముగానే అడ్డు కట్ట వేసుకుంటే ముందుకు సాగేది ఎలా అన్నదే గ్రహించాలి.

జీవితం నీదే :

ఇక జీవితం అన్నది ముందుగా రాసిపెట్టిన స్క్రిప్ట్ అన్నది ఒక తాత్విక భావన. దీనికి కూడా తార్కికమైన సమాధానాలు ఉన్నాయి. ఎవరు ఎక్కడ ఏ కుటుంబంలో పుట్టాలన్నది ఎవరి చేతిలో ఉండదు. కానీ పుట్టిన తరువాత మాత్రం జీవితంలో ప్రతీ నిర్ణయం వారే తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వాటి ఫలితాలు పర్యవసానాల గురించే అధికంగా చింతించి మిగిలిన జీవితాన్ని ఇబ్బందులపాలు చేసుకోవద్దు అన్నదే అంతా తెలుసుకోవాలి. ఏది ఏమైనా తరాలు ఎన్ని మారినా కాలం ఎంత ముందుకు సాగినా తాత్వికతతో పాటు వేదాంత భావనలు ప్రతి మనిషి ఆలోచనలలో ఉన్నపుడు టెన్షన్ నుంచి ఫ్రీ అవుతాడు. మరింత అందంగా భవిష్యత్తుని కూడా నిర్మించుకోగలడు. లేకపోతే శ్లేష్మంలో ఈగలా అందులోనే పడి కొట్టుకుపోతాడు. కెరీర్ ఓరియెంటేషన్ తో పాటు ఇది కూడా ముఖ్యమని గుర్తించిన నాడు ప్రతీ వారి లైఫ్ టెన్షన్ ఫ్రీగా హ్యాపీగా సాగిపోతుంది.

పుష్కరాలకు మోడీ వస్తున్నారు.. ఏర్పాట్లు అదరాలి: చంద్రబాబు

2027 గోదావరి పుష్కరాలకు ప్రధాని మోదీ ఏపీకి వస్తారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. జూన్ 26 నుంచి జులై 7 వరకు జరిగే పుష్కరాల కోసం రూ.3,700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. 440 ఘాట్ల అభివృద్ధి, 4 వేల ప్రత్యేక బస్సులు, 1,560 రైళ్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.వచ్చే ఏడాది జూన్‌లో ప్రారంభం కానున్న పవిత్ర గోదావరి పుష్కరాలకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని.. ఏర్పాట్లలో ఎక్కడా లోటు రాకూడ దని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో స్వచ్ఛత పాటించాలన్నారు. –నమో గోదావరి– పేరుతో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరాలు 12 రోజులు మాత్రమే ఉంటాయన్న అపోహ తొలగించాలని.. ఏడాది పాటు గోదావరి స్నానం ఆచరించవచ్చ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ప్రధాని మోడీ.. మహారాష్ట్రకు, ఏపీకి కూడా పుష్కరాల సమయంలోవస్తున్నట్టు చెప్పారు. తాను ఇటీవల ఆయనను కోరినట్టు తెలిపారు. దీనికి అంగీకరించారన్నారు..గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయని, ఏర్పాట్ల విషయంలో రాజీ పడవద్దని సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. వాటిని కూడా కలుపుకొని.. 3,700 కోట్ల రూపాయలతో పనులు చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు చెప్పారు. గోదావరి పరివాహక ప్రాంతంలో 440 ఘాట్లు అభివృద్ధి చేయాలన్నారు. భక్తుల కోసం 4 వేల ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి మరో 1,560 రైళ్లు నడిపేలా రైల్వే అధికారులతో చర్చించాలన్నారు.పుష్కరాల పర్యవేక్షణకు ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఎలాంటిఅవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులు కూడా రాష్ట్రానికి వస్తారని.. అలానే పెట్టుబడి దారులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అఖండగోదావరి ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని, పుష్కరాల సమయంలో దీనిని మరింతగా ప్రజలకు చేరువ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈవిషయంలో ఇప్పటికే చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నారని, వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు.

12 రోజులు కాదు..

పుష్కరాలు అనేది 12 రోజులు మాత్రమే కాదని సీఎంచంద్రబాబు చెప్పారు. ఏడాది పొడవునా ఎప్పుడు స్నానం చేసినా.. అదే ఫలితం వస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. తొక్కిసలాటలకు తావులేకుండా చూడాలన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలని.. అనుమతులు ఇవ్వాలని సూచించారు. పుష్కరాలంటే కేవలం స్నానంతోనే సరికాదన్నారు. చుట్టుపక్కల ఉన్న దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని.. పర్యాటకులను, భక్తులను ఆకర్షించడం ద్వారా ఆదాయ మార్గాలను కూడా అన్వేషించాలనిసూచించారు.

పెన్ పవర్

దోహాలో భారత్ ఎ, పాక్ ఎ జట్ల సమరం..

టాస్ సమయంలో గందరగోళం..

- దోహాలో ఏసీసీ పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నమెంట్
- భారత్ ఎ, పాక్ ఎ జట్ల మ్యాచ్
- టాస్ ఫలితం ప్రకటనలో మ్యాచ్ రిఫరీ పొరపాటు
- వెంటనే స్పందించి రిఫరీ దృష్టికి తీసుకెళ్లిన అబ్దుల్ సమద్
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ ఎ
- టాస్ ఫలితంపై సంతృప్తి వ్యక్తం చేసిన తిలక్ వర్మ



ఏసీసీ పురుషుల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నమెంట్‌లో భాగంగా భారత్ 'ఎ', పాకిస్థాన్ 'ఎ' జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ సందర్భంగా ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. దోహా వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ వేసిన సమయంలో మ్యాచ్ రిఫరీ చేసిన చిన్న పొరపాటు కాసేపు అయోమయానికి దారితీసింది.టాస్ సందర్భంగా మ్యాచ్ రిఫరీ ఫలితాన్ని తప్పుగా ప్రకటించాడు. అయితే అక్కడే ఉన్న పాకిస్థాన్ 'ఎ' జట్టు కెప్టెన్ అబ్దుల్ సమద్ ఈ విషయాన్ని వెంటనే గమనించాడు. అతడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా నాణెం వద్దకు వెళ్లి పరిశీలించాడు. టాస్ నిర్ణయాన్ని మరోసారి సరిచూసుకోవాల్సిందిగా రిఫరీని కోరాడు. పాక్ సారథి విజ్ఞప్తితో రిఫరీ పరిస్థితిని పునఃపరిశీలించి, తన ప్రకటనను సరిదిద్దుకున్నాడు. దీంతో పాకిస్థాన్ 'ఎ' జట్టు టాస్ గెలిచినట్లు అధికారికంగా ధ్రువీకరించారు.

టాస్ గెలిచిన అనంతరం పాకిస్థాన్ 'ఎ' కెప్టెన్ అబ్దుల్ సమద్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పిచ్ పొడిగా ఉందని, తొలుత బ్యాటింగ్ చేయడం ద్వారా తమ జట్టుకు మంచి ప్రయోజనం కలుగుతుందని అతడు పేర్కొన్నాడు. తమ జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని తెలిపాడు. మరోవైపు భారత్ 'ఎ' కెప్టెన్ తిలక్ వర్మ స్పందిస్తూ.. తాము కూడా టాస్ గెలిస్తే బ్యాటింగ్ చేయాలనే భావించామని, అయితే ప్రత్యర్థిని ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించడం పట్ల తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశాడు.ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఇరు జట్ల వివరాలను పరిశీలిస్తే.. తిలక్ వర్మ నేతృత్వంలోని భారత్ 'ఎ' జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్, హర్షిత్ రాణా వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అబ్దుల్ సమద్ సారథ్యంలోని పాకిస్థాన్ 'ఎ' జట్టులో మాజ్ సదాకత్, రోహైల్ నజీర్, హసన్ నవాజ్ తదితరులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టాస్ సమయంలో అబ్దుల్ సమద్ సమయస్ఫూర్తితో వ్యవహరించి రిఫరీ దృష్టికి తీసుకెళ్లడంతో మ్యాచ్ ఆరంభానికి ముందే సరైన నిర్ణయం ఖరారైంది.

వెల్లింగ్టన్‌లో పంత్ సెంచరీకి గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్..

న్యూజిలాండ్‌తో టెస్టులో రిషభ్ పంత్ తొమ్మిదో సెంచరీ
సిక్సర్‌తో శతకం పూర్తి.. స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చిన గవాస్కర్
సెనా దేశాల్లో సెంచరీ చేసిన తొలి ఆసియా వికెట్ కీపర్‌గా రికార్డు
అత్యధిక టెస్టు శతకాలు బాదిన కీపర్ల జాబితాలో మూడో స్థానం



టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరోసారి తనదైన శైలిలో చెలరేగిపోయాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న టెస్టు మ్యాచ్ నాలుగో రోజు పంత్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఇది అతనికి టెస్టుల్లో తొమ్మిదో శతకం. ఈ సెంచరీతో పంత్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నింగ్స్‌లో భాగంగా గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో మిడ్-ఆఫ్ మీదుగా అద్భుతమైన సిక్సర్ బాది పంత్ తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో కామెంటరీ బాక్సులో ఉన్న భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్, పంత్ షాట్‌కు ముగ్ధుడై తన సీటులో నుంచి లేచి నిలబడి చప్పట్లతో అభినందించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ పంచుకుంది.

అరుదైన రికార్డులు బద్దలు!

ఈ సెంచరీతో టెస్టుల్లో అత్యధిక శతకాలు సాధించిన వికెట్ కీపర్ల జాబితాలో పంత్ మూడో స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లండ్‌కు చెందిన లెస్ అమెస్ (8 సెంచరీలు)ను అతను అధిగమించాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ (17), జింబాబ్వే ఆటగాడు ఆండీ ఫ్లవర్ (12) మాత్రమే పంత్ కన్నా ముందున్నారు.

అంతేకాకుండా 'సెనా' దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా నాలుగింటిలోనూ టెస్టు సెంచరీ చేసిన తొలి ఆసియా వికెట్ కీపర్‌గా పంత్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన మూడో వికెట్ కీపర్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో పంత్ చేసిన శతకం, న్యూజిలాండ్‌పై భారత్ పట్టును మరింత బిగించేందుకు దోహదపడింది.

4 బంతుల్లో 4 వికెట్లు.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జంషెడ్ ఆలం సంచలనం



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఎలైట్ 2026 టోర్నీలో క్రికెట్ అభిమానులు ఊపిరి బిగబట్టే అద్భుతం చోటు చేసుకుంది. సౌరాష్ట్రతో జరిగిన కీలక పోరులో రైల్వేస్ యువ పేసర్ జంషెడ్ ఆలం బంతితో నిప్పులు చెరుగుతూ వరుసగా 4 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు. మ్యాచ్‌లో మొత్తంగా 38 పరుగులు ఇచ్చి 5 వికెట్లు కూల్చిన ఈ 23 ఏళ్ల పేసర్, సౌరాష్ట్రను 153/8 స్కోరుకే కట్టడి చేసి రైల్వేస్‌కు 29 పరుగుల ఉత్కంఠ విజయాన్ని అందించాడు.

నాలుగు బంతుల్లో నలుగురు ఔట్:

రైల్వేస్ నిర్దేశించిన 183 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌరాష్ట్రకు ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లోనే జంషెడ్ ఆలం కోలుకోలేని దెబ్బ కొట్టాడు.

వరుసగా 4 వికెట్లు: ఆ ఓవర్లో ముందుగా హార్విక్ దేశాయ్‌ను పెవిలియన్‌కు పంపిన ఆలం, ఆ తర్వాతి మూడు బంతుల్లో వరుసగా ప్రేరక్ మాంకడ్, రుచిత్ అహిర్, సమర్ గజ్జర్లను ఔట్ చేసి అరుదైన డబుల్ హ్యాట్రిక్ పూర్తి చేశాడు.

మిథున్, నల్కండే సరసన రికార్డు: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన మూడో బౌలర్ గా జంషెడ్ ఆలం చరిత్ర సృష్టించాడు. గతంలో అభిమన్యు మిథున్, దర్శన్ నల్కండే మాత్రమే ఈ అరుదైన ఘనత సాధించారు.

ఆకట్టుకున్న ఖ-19 ఆసియా కప్ హీరో:

ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర ఓటమి పాలైనప్పటికీ, అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన మొహిత్ ఉల్వా) తన ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. తొలుత బౌలింగ్‌లో 4 ఓవర్లలో 38 పరుగులిచ్చి 2 వికెట్లు తీసిన మొహిత్, లక్ష్య ఛేదనలోనూ కేవలం 15 బంతుల్లో 22 రన్స్ చేసి జట్టును గెలిపించేందుకు పోరాడాడు. కానీ, జంషెడ్ ఆలం ఐదు వికెట్ల ధాటికి సౌరాష్ట్ర 153/8 స్కోరుకే పరిమితం కావడంతో మొహిత్ పోరాటం వృథా అయింది.

హనుమాన్-2.. తేలిగ్గా తీసుకోలేం

2024 సంక్రాంతికి రిలీజైన 'హనుమాన్' సినిమా ఎంతటి సంచలనం రేపిందో తెలిసిందే. పోటీలో 'గుంటూరు కారం' లాంటి పెద్ద సినిమా ఉండగా.. స్టార్ కాస్ట్ లేని ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ప్రభంజనం సృష్టించింది. తెలుగులోనే కాక ఇతర భాషల్లోనూ భారీ వసూళ్లు రాబట్టి పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. ఈ సినిమాకు కొనసాగింపుగా 'జై హనుమాన్' ఉంటుందని ఆ చిత్రం చివర్లో లీడ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆటోమేటిగ్గా ఈ సినిమాను ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ బేనర్లోనే ప్రశాంత్ తీస్తాడని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బేనర్లో చేయడానికి రెడీ అయిపోయాడు ప్రశాంత్. నిర్మాతలతో తనకు ఏం సమస్యో తెలియదు కానీ.. అతనో చిన్న దర్శకుడిగా ఉండగా నమ్మి స్టార్ కాస్టింగ్ లేకపోయినా మంచి క్వాలిటీతో సినిమాను ప్రొడ్యూస్ చేసిన నిర్మాతలను వదిలేశాడేంటి అనే ప్రశ్న తలెత్తింది. కానీ తెర వెనుక ఏం జరిగిందో తెలియదు కాబట్టి ప్రశాంత్‌ను కూడా తప్పుబట్టలేం. ఐతే ఈ విషయాన్ని 'హనుమాన్' ప్రొడ్యూసర్లు అంత తేలిగ్గా తీసుకోలేదని ఈ రోజే అర్థమైటంది. పంతం పట్టి తమ బేనర్లో ప్రత్యేకంగా 'హనుమాన్' సీక్వెల్‌ను అనౌన్స్ చేశారు. ఐతే 'హనుమాన్' సీక్వెల్ అంటే ప్రశాంత్ చేయడమే కరెక్ట్ అనే భావన ఉంటుంది ప్రేక్షకుల్లో. పైగా 'కాంతార' హీరో రిషబ్ శెట్టి అందులో లీడ్ రోల్ చేస్తుండడం, మైత్రి లాంటి పెద్ద సినిమా ప్రొడ్యూస్ చేస్తుండడంతో దానికి ఉన్న హైపే వేరు. ఈ నేపథ్యంలో ప్రొడ్యూసర్లు వేరుగా 'హనుమాన్' సీక్వెల్ అంటే ఆడియన్స్ లైట్ తీసుకుంటారనే భావిస్తాం. కానీ మెగా ఫ్యామిలీకి చెందిన పంజా వైష్ణవ్ తేజ్ ఇందులో హీరోగా నటిస్తున్నాడు. పైగా వైవిధ్యమైన సినిమాలకు పెట్టింది పేరైన వీఐ ఆనంద్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నాడు. ప్రైమ్ షో వాళ్లు కూడా ఈ సినిమాను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీ బడ్జెట్ పెట్టడానికి రెడీ అయిపోయారు. కాబట్టి ఈ ప్రాజెక్టును తేలిగ్గా ఏమీ తీసుకోలేం. మొత్తానికి 'హనుమాన్'కు ఒకే టైంలో రెండు సీక్వెల్స్ తెరకెక్కడం, రెండూ ఆసక్తి రేకెత్తిస్తుండడం విశేషంగానే చెప్పుకోవాలి.





లైమ్ గ్రీన్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న రాయ్ లక్ష్మి

అందమైన ఐవరీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తున్న జాన్వీ కపూర్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965